18న భారత్‌కు యూఎస్
వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్





ఆయన సతీమణి ఉష తెలుగింటి ఆడపడుచే.. 2



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 17 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:111 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |




సహాయక చర్యలపై సాంకేతిక కమిటీ





ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ప్రభుత్వ చర్య 2

# మన రైలుకు 172 ఏండ్లు

**1853 ఏప్రిల్ 16న ముంబయిలోని బోరిబందర్ స్టేషన్ నుంచి థాణే వరకు ప్రయాణించిన తొలి రైలు**

**14 కోచ్‌లు.. మూడు ఇంజన్‌లు..**

**400 ప్రయాణీకులతో ప్రథమ పయనం**

**ముంబై, ఏప్రిల్ 16:** ప్రపంచంలోనే అతి పెద్దది భారతీయ రైల్వే. దేశంలో నిత్యం కోట్లాది మంది ప్రయాణికులకు సేవలందిస్తోన్న మన రైల్వే ఏప్రిల్ 16వ తేదీన 172వ వార్షికోత్సవం జరుపుకుని 173వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. 1853 ఏప్రిల్ 16న ముంబయి నుంచి థాణెకు మొదలైన ఈ రైలు దేశంలో తొలిసారి ప్యాసింజర్ రైలుగా చరిత్రలో నిలిచిపోయింది. ఈ సందర్భంగా వీటి ప్రారంభం గురించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కొన్ని కీలక విషయాలను ప్రజలతో పంచుకున్నారు. 1853 ఏప్రిల్ 16న మూడు ఇంజిన్లతో కూడిన తొలి రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి థాణే వరకు ప్రయాణించింది. ఆ రోజు భారతీయ చరిత్రాత్మకమైంది. ఆ రోజు అక్కడ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మధ్యాహ్నం 3.35గంటలకు 14 కోచ్‌లతో కూడిన రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి థాణెకు ప్రయాణించింది. 21 తుపాకీలతో సెల్యూట్ చేశారు. ఆహ్వానం ఉన్న 400 మంది అందులో ప్రయాణించారు. సింధ్, సుల్తాన్, సాహెబ్ పేర్లు కలిగిన మూడు ఇంజిన్లతో రైలు ప్రారంభమైంది. 34 కి.మీ దూరాన్ని 1 గంట 15నిమిషాల్లో చేరుకుంది. అప్పటి నుంచి భారతీయ రైల్వే సేవలు అందిస్తూనే ఉంది'' అని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తొలి రైలు వెళ్తున్న చిత్రంతోపాటు ఇటీవల దేశంలో నిర్మించిన మూడు అద్భుత రైల్వే వంతెనల ఫోటోలను ఈ సందర్భంగా ఆయన పోస్టు చేశారు.

# అమరావతిపై కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు: మంత్రి నారాయణ ఆగ్రహం



**అమరావతి:** రాజధాని అమరావతి పై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతుల భూముల ధర నిలవాలన్నా.. పెరగాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని చెప్పారు. బుధవారం మీడియాతో మంత్రి మాట్లాడారు.

''విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టాలంటే ఫ్లైట్ కనెక్టివిటీ ఉండాలి. అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కట్టాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఎయిర్‌పోర్ట్ కోసం భూసేకరణ లేదా భూ సమీకరణ అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే అమరావతిలో పనులు ప్రారంభం అయ్యాయి. భూములిచ్చిన రైతు సోదరులకు ఎలాంటి అపోహలు వద్దు. ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తాం. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తవుతుంది'' అని పి.నారాయణ తెలిపారు.



## కేంద్రం అదనపు సాయం చేసేలా ప్రతిపాదనలు పంపండి

### ఆర్థిక సంఘం ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

**అమరావతి:** రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుపై సచివాలయం మొదటి బ్లాక్‌లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. ఫొటో ఎగ్జిబిషన్‌లోని అంశాలపై సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వంటి అంశాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా రాజధాని విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను సీఎం వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అందాల్సిన ప్రత్యేక సాయంపై సీఎం ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047 గురించి తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు అనుకూలతల గురించి చెప్పారు. విభజన అనంతరం రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలను మరోసారి వివరించారు. గత ఐదేళ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసంతో ఎదుర్కొంటున్న సవాళ్లను వారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం అదనపు సాయం చేయాలని.. దానికి అనుగుణంగా ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం కోరారు.

## రాజ్యసభ స్థానానికి సీఈసీ నోటిఫికేషన్

**అమరావతి:** ఏపీలో రాజ్యసభ స్థానానికి సీఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వంలో కీలక నేతగా ఉన్న విజయసాయిరెడ్డి 2028 జూన్ వరకు పదవీకాలం ఉండగానే ఎంపీ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఏర్పడిన ఖాళీ భర్తీకి సీఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది.

**షెడ్యూల్ ఇదే..**

ఈ నెల 22 నుండి 29 వరకు నామినేషన్ల స్వీకరణ
ఈ నెల 30న నామినేషన్ల పరిశీలన
మే 2 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు
మే 9న రాజ్యసభ స్థానానికి ఎన్నిక, ఫలితాలు

కాగా, ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారానికి దూరం కావడంతో పలువురు కీలక నేతలు తమ పదవులకే కాకుండా.. పార్టీ సభ్యత్వానికి సైతం రాజీనామాలు చేశారు. ఈ క్రమంలోనే ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడిగా ఉన్న విజయసాయిరెడ్డి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అంతేకాదు.. భవిష్యత్తులో తాను ఏ రాజకీయ పార్టీలో చేరనని స్పష్టం చేశారు. పూర్తిగా వ్యక్తిగత కారణాలతో రాజీనామానే చేస్తున్నానని, భవిష్యత్తులో వ్యవసాయం చేసుకుంటానంటూ ఆయన వెల్లడించారు.

2019 పార్టీ ఎన్నికల్లో గెలుపుతోపాటు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ...మిగతా 2లో

## ఆంధ్రప్రదేశ్‌లో మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల ప్రకటన

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి నామినేటెడ్ పదవుల భర్తీని కూటమి ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 30 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రకటించింది. కేటాయించిన 30 స్థానాల్లో.. 30 మంది తెదేపా నాయకులు, నలుగురు జనసేన, ఒక భాజపా నేతకు నామినేటెడ్ పదవులు దక్కాయి. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. త్వరలోనే మిగతా మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రకటించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం

### రూ.4,668 కోట్ల వ్యయంతో నిర్మాణం

### వేగంగా అమరావతి నిర్మాణ పనులు

**అమరావతి:** అమరావతి రాజధాని పనులు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు నిధులు సమకూర్చుకుంటూ టెండర్లను కూడా పిలుస్తున్నారు. తాజాగా రాజధానిలో సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీయే ఈరోజు టెండర్లను ఆహ్వానించింది. సచివాలయానికి నాలుగు, హెచ్ ఓడీ కార్యాలయానికి ఒక ...మిగతా 2లో

## వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటీ కృష్ణవేణి అరెస్ట్



**గుంటూరు:** వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటీ కృష్ణవేణి హైదరాబాద్లో అరెస్ట్ అయ్యారు. పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీసులు బుధవారం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పాలేటీ కృష్ణవేణిని ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్‌కు ఏపీ పోలీసులు తీసుకువెళ్లారు. ఆ తర్వాత ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ నుంచి దాచేపల్లి పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించనున్నారు.

## పేద విద్యార్థులకు సర్కార్ గుడ్ న్యూస్

**అమరావతి:** పేద విద్యార్థులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ తెలిపింది. 2025-26 అకడమిక్ ఇయర్ లో అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్ళలో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత సీట్ల కేటాయింపుపై నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యా హక్కు చట్టం ప్రకారం 1వ తరగతిలో 25% సీట్లు పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు కేటాయిస్తూ నోటిఫికేషన్ విడుదలైంది. 5 ఏళ్లు నిండిన వివరాలతో కూడిన వివరాలను ...మిగతా 2లో



### ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు

## ఏబీసీడీ అవార్డులు

### ప్రదానం చేసిన ఏపీ డీజీపీ

**అమరావతి:** నేరాలను ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఏబీసీడీ అవార్డులను ప్రదానం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో జరిగిన హత్య కేసును ఛేదించిన పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి నేతృత్వంలోని పోలీసులకు ప్రథమ బహుమతి అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా గుడిబండలో ఓ వ్యక్తి శిశువును హత్య చేసి కర్ణాటకకు పారిపోయి జీవనం సాగిస్తున్నాడు. 26 ఏళ్ల కిందట జరిగిన ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించిన పోలీసులకు ద్వితీయ బహుమతి దక్కింది. విజయనగరం పరిధిలో డిజిటల్ అరెస్ట్ పేరుతో లక్షల రూపాయలను దోచుకున్న ఐదుగురు నిందితులను విజయనగరం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.10 లక్షలు, రూ.9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.22 లక్షలను సీజ్ చేశారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులకు తృతీయ బహుమతి దక్కింది. చేబ్రోలు పీఎస్ పరిధిలో జరిగిన మైనర్ బాలిక హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులకు డీజీపీ బహుమతి అందించారు. సాంకేతిక పరిజ్ఞానంతో క్లిష్టమైన కేసుల్లోని మిస్టరీని ఛేదించిన పోలీసులను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అభినందించారు.



## శ్రీవారి తులాభారానికి వచ్చిన రూ.కోట్లు దారి మళ్లించారు: భాను ప్రకాశ్ రెడ్డి

**అమరావతి:** వైకాపా హయాంలో శ్రీవారి తులాభారం కింద భక్తులు ఇచ్చిన కోట్లాది రూపాయల్ని దారి మళ్లించారని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన.. అప్పట్లో విజిలెన్స్ నివేదిక ఇచ్చినా ఎందుకు తొక్కిపెట్టారని ప్రశ్నించారు.

## గద్దర్ అవార్డుల జ్యూరీ ఛైర్మన్ గా జయసుధ

### అవార్డులకు అన్ని విభాగాల్లో కలిపి 1248 నామినేషన్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** తెలుగు సినిమా రంగాన్ని ప్రోత్సహించేం దుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీకి ఛైర్మన్ గా నటి జయసుధ ఎంపికయ్యారు. ఈ జ్యూరీలో ఆమెతో పాటు 15 మంది సభ్యులుంటారు. జయసుధ, ఎఫ్ డీసీ ఎండీ హరీశ్ లతో సమావేశమైన ఎఫ్ డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కోరారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను ఇస్తున్నట్టు గుర్తుచేసిన దిల్ రాజు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డులకు ఇంతటి స్పందన రాలేదన్నారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల కోసం అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లు రాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు దిల్ రాజు వెల్లడించారు.




6

ఈడీని రద్దు చేయాలె

ఐడీ వంటివి ఉండగా ఈడీ ఎందుకు?

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్




## కాకాణికి దెబ్బ మీద దెబ్బ

**నెల్లూరు:** తాను ఒకటి తలిస్తే.. దైవం ఒకటి తలిచినట్లుయిందీ వైసీపీ పరిస్థితి. 2024 ఎన్నికల్లో గెలుపు కోసం వై నాట్ 175 అంటూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ నినాదంగా చేసుకున్నారు. కానీ ఆ ఎన్నికల్లో మాత్రం వైసీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఎన్నికల్లో ఘోర ఓటమి చవి చూడడంతో పార్టీకి పలువురు కీలక నేతలు తమ పదవులకే కాదు.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా చేసేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఇంకా ఏడాది కూడా కాకుండానే ఫ్యాన్ పార్టీకి గుడ్ బై చెబుతున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది.తాజాగా ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. సదరు నియోజకవర్గంలో మొత్తానికి మొత్తంగా ఖాళీ అవుతోంది. ఈ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన కాకాణి గోవర్ధన్ రెడ్డి.. దగ్గర దగ్గర నెలరోజులుగా పరారీలో ఉన్నారు. అతడి కోసం జిల్లా పోలీసులు డేగ కళ్లలో గాలిస్తున్నారు. ఆ క్రమంలో హైదరాబాద్,బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో మాజీ మంత్రి కాకాణి కోసం జల్లెడ పడుతున్నారు. అందులోభాగంగా అతడి బంధువులు, స్నేహితుల నివాసాలపై నిఘాను సైతం పెంచారు.

### గాంధీ కుటుంబానికి చెందినందునే నన్ను

## టార్గెట్ చేస్తున్నారు



### బీజేపీలో ఉండి ఉంటే మరోలా ఉండేది

### కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా

### అందుకే, ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నా

**ఢిల్లీ, ఏప్రిల్ 16 :** తాను గాంధీ కుటుంబానికి సంబంధించిన వ్యక్తి కావడం వల్లే ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా ఆరోపించారు. హర్యానా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన ఈడీ విచారణను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందించారు. వాద్రా వరుసగా రెండోరోజు ఈడీ విచారణకు హాజరయ్యారు. ''నిత్యం ప్రజల కోసం పోరాడే గాంధీ కుటుంబంలో నేను భాగం. దాంతో సహజంగానే నన్ను, మా కుటుంబాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంటుంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై వారు ఛార్జి షీట్‌దాఖలు చేశారు. మీరు బీజేపీ ఎంతగా ...మిగతా 2లో

# వక్ఫ్ చట్ట రూపాన్ని ఆర్టికల్ 26 నిరోధించదు?

## ఈ రాజ్యాంగ నిబంధన అందరికీ వర్తించే లౌకికమైన స్వభావమున్నదే

## ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌ల విచారణ ప్రారంభించిన సుప్రీం కోర్టు



హైదరాబాద్, మనం ప్రతినిధిః వక్ఫ్ సవరణ చట్టం-2025ను ఆర్టికల్ 26 నిరోధిం చదని, ఆ రాజ్యాంగ నిబంధన సార్వత్రికమైందని సుప్రీంకోర్టు పేర్కొంది. అందరికీ వర్తించే ఈ నిబంధన లౌకిక స్వభావాన్ని కలిగి ఉందని తెలిపింది. వక్ఫ్ సవరణ చట్టం- 2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. వందల ఏండ్ల నాటి ఆస్తులకు పత్రాలు ఎక్కడి నుంచి వస్తాయని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వక్ఫ్ చట్టంపై నిరసనల సందర్భంగా హింస చోటు చేసుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరపున కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, న్యాయవాది హుజేఫా అహ్మదీ సుప్రీంకోర్టులో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ వక్ఫ్ బిల్లుపై విస్తృత చర్చ జరిపిందని కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అనంతరం కోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది.

# రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

టవర్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. హెచ్వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లకు టెండర్లు పిలిచింది. సచివాలయం 1, 2 టవర్ల కోసం రూ.1,897 కోట్లతో మరో టెండర్ను ఆహ్వానించింది. సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లతో టెండర్లు జారీ అయ్యాయి. మొత్తం రూ.4,668 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మే 1న సచివాలయం, హెచ్ ఓడీ టవర్ల టెక్నికల్ బిడ్స్ తెరవనున్నారు. వీటితోపాటు సచివాలయంలో సీసీ కెమెరాలు,. కమాండ్ కంట్రోల్ కు టెండర్లు పిలిచారు. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77,249 కోట్లు అవసరం కాగా... వరల్డ్ బ్యాంక్, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ.31,000 కోట్లు సమకూరాయి. ఇంకా నిధులు రూ.47,000 కోట్లు కావలసి ఉంది. ఈరోజు 16వ ఆర్థిక సంఘ సభ్యులతో జరిగిన సమావేశంలోనూ ముఖ్యమంత్రి ఈ విషయాలను ప్రస్తావించారు. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వచ్చే నెల 5వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి రానున్నారు. ఏపీలో ప్రధాని పర్యటన సక్సెస్ కు మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఉపసంఘంలో సభ్యులుగా మంత్రులు పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, నారాయణను నియమించారు. మరో వైపు పురపాలక శాఖ మంత్రి నారాయణ అమరావతి రాజధానిలో విస్తతంగా పర్యటిస్తున్నారు. రాజధాని నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం పలకడం మరో ముందుడుగుగా అంతా భావిస్తున్నారు.

## రాజ్యసభ స్థానానికి సీఈసీ నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణ స్వీకారం చేసే వరకు తెరచాటు యంత్రంగా పనిచేశారు విజయసాయిరెడ్డి. అయితే, జగన్ అధికారం చేపట్టిన అనంతరం క్రమక్రమంగా విజయసాయిరెడ్డి పాత్ర కనుమరుగవుతూ వచ్చింది. ప్రాధాన్యత లేని పదవులు ఇవ్వడంతో ఆయన అశాంతికి గరయ్యారని, ఇంతలోనే ఎన్నికలు రావడం, వైసీపీ కేవలం 11 సీట్లకు పరిమితం కావడంతో ఆయన ఎంపీ పదవీతోపాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. అయితే, సంఖ్యా బలం ఆధారంగా కూటమి ప్రభుత్వానికే ఎంపీ స్థానం దక్కే అవకాశం ఉంది.

# సహాయక చర్యలపై సాంకేతిక కమిటీ

హైదరాబాద్, ఏప్రిల్ 16ః ఎస్ఎల్బీసీ సొరంగంలో సహాయక చర్యల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్, ఎన్జీఆర్ఐ డైరెక్టర్, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎన్సీఎస్ డైరెక్టర్, బీఆర్వో కల్నల్ పరీక్షిత్ మెహ్రా, తెలంగాణ పీసీసీఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ అదనపు డీజీ, సీడీవో సీఈ, నాగర్కర్నూల్ కలెక్టర్, ఎస్పీ, ఎస్ఎల్బీసీ చీఫ్ ఇంజినీర్, నిపుణులు సాంకేతిక కమిటీలో సభ్యులుగా ఉంటారు.

ఎస్ఎల్బీసీ సొరంగంలోని చివరి 30 నుంచి 50 మీటర్ల క్రిటికల్ జోన్లో ఉన్న రాతి పొరల స్థితి కారణంగా ఆ ప్రాంతంలో ఎలాంటి సహాయక చర్యలు చేపట్టవద్దని జీఎస్ఐ సూచించింది. ఈ నేపథ్యంలో ఆ క్రిటికల్ జోన్లో అనుసరించాల్సిన కార్యాచరణ, వ్యూహాల రూపకల్పనకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. నిర్దిష్ట గడువులోగా ఆరుగురు కార్మికుల మృతదేహాలను వెలికితీసి కుటుంబసభ్యులకు అప్పగించేలా కమిటీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సహాయక చర్యల్లో అపాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపైనా కమిటీ సూచనలు చేయాల్సి ఉంటుంది.

ఎస్ఎల్బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి కోసం 55 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. చివరి 50 మీటర్ల ప్రాంతం వరకు 800 టన్నుల ఇనుము, 1200 క్యూబిక్ మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను తొలగించారు. మిగిలిన ప్రాంతం చాలా ప్రమాదకరంగా ఉందని, మిగిలిన వ్యర్థాలను తొలగిస్తే ప్రతికూల పరిణామాలు ఎదుర్కోవాల్సి రావొచ్చని జీఎస్ఐ హెచ్చరించింది. సహాయక చర్యలు కొనసాగిస్తే సహాయక చర్యల్లో పాల్గొనే వారికి ప్రమాదం ఎదురుకావచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. వీటన్నింటి నేపథ్యంలో అవసరమైన అనుమతులు తీసుకొని సహాయక చర్యలు చేపట్టాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది.

# బంగారం 98,000.. పసిడి సరికొత్త రికార్డ్!



దిల్లీ: అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. అమెరికా- చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరమవుతుండడంతో సురక్షిత పెట్టుబడిగా భావించి పసిడిపై పెట్టుబడులు మళ్లి స్తున్నారు. అంతర్జాతీయ ధరను అనుసరించి దేశీయంగానూ దీని ధరకు రెక్కలు వస్తున్నాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ఒక్క రోజులోనే రూ.1650 మేర పెరిగి రూ.98,100ను తాకింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి సైతం రూ.1650 మేర పెరిగి రూ.97,650కు పెరిగింది.సాయంత్రం 4.30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల పసిడి రూ.97,700కు చేరింది. అటు వెండి ధర సైతం కిలోకు ఒక్క రోజులో రూ.1900 మేర పెరిగి రూ.99,400కు చేరింది. మంగళవారం కిలో వెండి రూ.97,500 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా చూసినప్పుడు ఇం ట్రాడేలో గరిష్ఠంగా ఔన్సు 3,318 డాలర్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం 3,296 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## పేద విద్యార్థులకు సర్కార్ గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

ఈనెల 28 నుంచి మే 15వ తేదీ వరకు ప్రభుత్వానికి అప్లికేషన్స్ సమర్పిస్తే.. వాటిని అధికారులు పరిశీలించి అర్హులైన విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొంది. అయితే అప్లికేషన్ తో పాటు తల్లిదండ్రుల ధవీకరణ పత్రాలైన ఆధార్/ఓటర్/రేషన్/జాబ్ కార్డు/విద్యుత్ బిల్లులో ఏదైనా ఒక దానితోపాటు.. విద్యార్థి బర్త్ సర్టిఫికెట్ అటెస్ట్ చేయాలని తెలిపింది.

# గాంధీ కుటుంబానికి చెందినందునే నన్ను టార్గెట్ చేస్తున్నరు

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బంది పెడితే.. మేం అంతగా బలపడతాం. మాకు ఎదురయ్యే ప్రతిసవాలును దాటుకొని ముందుకు వెళతాం. కానీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం దురదృష్టకరం. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపే వారిపై ఒత్తిడి తెచ్చేందుకు వాటిని దుర్వినియోగం చేస్తుండటంతో ఇక ప్రజలు ఆ సంస్థలను విశ్వసించరని నా అభిప్రాయం. అదే నేను బీజేపీలో ఉండి ఉంటే.. పరిస్థితి వేరుగా ఉండేది. ప్రజలు నాతో ఉన్నారు. వారు నేను రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నారు'' అని వాద్రా మీడియాకు తెలిపారు. ఇక ఈ కేసులో హర్యానా ప్రభుత్వం తనకు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఈడీ విచారణలో అడుగుతున్న ప్రశ్నలకు 2019లోనే సమాధానం ఇచ్చానని, మళ్లీ ఇప్పుడు అవే ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారో తెలియడం లేదు అని వ్యాఖ్యలు చేశారు. ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్లోని షికోపూర్లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్ కు భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతున్నది.

# స్మితా సబర్వాల్‌కు పోలీసుల నోటీసులు

- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఏఐ చిత్రాన్ని ఆమె షేర్ చేశారంటూ నోటీసులు
- బీఎన్ఎస్ఎస్ 179 సెక్షన్ కింద నోటీసులు
- మార్చి 31న చిత్రాన్ని రీట్వీట్ చేసిన స్మితా సబర్వాల్


హైదరాబాద్, మనం ప్రతినిధిః కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఐఏఎస్ అధికారిణి, రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల అడవి విధ్వంసానికి సంబంధించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చిత్రాన్ని ఆమె పంచుకున్నారని చెబుతూ పోలీసులు ఈ నోటీసులు అందించారు. ఈ యేడాది మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన చిత్రాన్ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు.
అందులో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) మష్రూమ్ రాక్ వద్ద చాలా బుల్డోజర్లు ఉన్నట్లుగా ఉంది.
వాటి ముందు నెమలి, జింక ఉన్నాయి. ఈ చిత్రంపై విచారణ జరిపిన పోలీసులు అది నకిలీ చిత్రమని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో బీఎన్ఎస్ఎస్ 179 సెక్షన్ కింద స్మితా సబర్వాల్‌కు నోటీసులు ఇచ్చినట్లు గచ్చిబౌలి పీఎస్ ఎస్‌హెచ్ఓ మహ్మద్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఒక కేసును దర్యాప్తు చేస్తున్న అధికారి సాక్షులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## ఆ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో ఎందుకు చేరిండ్రో?

- ఓసారి ముఖ్యమంత్రి, మరోసారి ధర్మపురి అరవింద్‌తో కనిపిస్తుండ్రు

హైదరాబాద్, మనం ప్రతినిధిః జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆశ్చర్యం కలిగించిందని, ఆయన ఎందుకు ఆ నిర్ణయం తీసుకున్నారో అర్థం కావడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆయన డబ్బు కోసమే అధికార పార్టీ వైపు వెళ్లారని అందరూ అంటున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఏదైనా చేయాలనే చిత్తశుద్ధి ఉంటే ఆయన పార్టీ మారాల్సిన అవసరం ఉండేది కాదని అన్నారు. ఇటీవల ఎమ్మెల్యేల పనితీరుపై ర్యాంకులు ఇచ్చారని, 119 మంది ఎమ్మెల్యేల్లో సంజయ్కు 108వ ర్యాంకు వచ్చిందని ఆమె ఎద్దేవా చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే ఎంత గొప్పగా పని చేస్తున్నారో ఈ ర్యాంకును బట్టి తెలుస్తోందని అన్నారు. అసెంబ్లీలో ఆయన ప్రజా సమస్యలపై ఎప్పుడు మాట్లాడలేదని, ఒక్కసారైనా నోరు విప్పింది లేదని విమర్శించారు. ఎమ్మెల్యే సంజయ్ ఒకసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కనిపిస్తారని, మరోసారి బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌లో కలిసి కనిపిస్తారని, ఆయన అయోమయంలో ఉన్నట్లుగా ఉందని అన్నారు. ఆయన ఏ పార్టీలో ఉన్నప్పటికీ జగిత్యాలకు రావాల్సిన పథకాలు, నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# 18న భారత్ కు యూఎస్ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్



వాషింగ్టన్, ఏప్రిల్ 16ః అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన సతీమణి ఉషాతో కలిసి 18న భారత్ కు విచ్చేయనున్నారు. వారి పర్యటన 24 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం జేడీ వాన్స్ మన దేశానికి రావడం ఇదే మొదటిసారి. ఆయన సతీమణి ఉష తెలుగమ్మాయి అనే విషయం తెలిసిందే.

తన పర్యటనల్లో భాగంగా వాణిజ్య, భౌగోళిక రాజకీయ అంశాలపై జేడీ వాన్స్ చర్చలు జరుపుతారని అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. భారత్- అమెరికా వాణిజ్య చర్చల వేళ ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఉషా మన తెలుగమ్మాయే..

ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1970ల్లోనే అమెరికాకు వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. యేల్ లా స్కూల్లో ఉషా, జేడీ వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడి.. 2014లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భర్త విజయంలో ఉష కీలక పాత్ర పోషించారు. అమెరికా సెకండ్ లేడీ హోదాలో తన పూర్వీకుల దేశానికి రావడం ఆమెకు ఇదే తొలిసారి.


# కాంగ్రెస్ చేసిన విధ్వంసం ఎంతటిదో సుప్రీం తేటతెల్లం చేసింది

- ప్రభుత్వ భూములు, పర్యావరణాన్ని కబళించాలని చూసిండ్రు?
- మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్, మనం ప్రతినిధిః ఒక బాధ్యత గల ప్రభుత్వం.. కావాలనే సెలవు దినాల్లో బుల్డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైందన్నారు. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ తన రిపోర్టుతో కళ్లు తెరిపించిందన్నారు. అధికారం ఉంది కదా? అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైందని.. తెలంగాణలో కూడా ఈరోజు అదే జరిగిందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

# మానవీయ కోణంలో చూడాలె

- రాజీవ్ యువ వికాస పథకం లబ్ధిదారులకు రుణాలపై బ్యాంకర్లకు సూచన
- యువకుల జీవితాలు మారతా య్.. మీకు మంచి పేరొస్తుంది
- జిల్లా స్థాయిలో బ్యాంకర్లతో కలె క్టర్లు సమావేశం నిర్వహించాలె
- బ్యాంకు అధికారులతో ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్,మనం బ్యూరోః రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగుల జీవితాలు మారతాయ్.. వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో ఈ పథకం ఒక గేమ్ ఛేంజర్‌లా నిలుస్తుందని పేర్కొన్నారు. బుధ వారం ప్రజా భవన్‌లో యువ వికాసం పథకం అమ లుపై బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని సాధారణ సంక్షేమ పథకంగా చూడొ ద్దని బ్యాంకర్లను కోరారు. మానవీయ కోణంలో ప్రభు త్వంలోని సీనియర్ అధికారులు సుదీర్ఘ సమావేశాలు నిర్వహించి ఈ పథకానికి రూపకల్పన చేసినట్లు వెల్ల డించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఇంత పెద్ద మొత్తంలో స్వయం ఉపాధి పథకాలకు ఏనాడూ ఏ ప్రభుత్వం కేటాయింపులు చేయలేదని తెలిపారు. కొలు వుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాల పాటు నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదన్నారు. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే మిగిలిపోయిన నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా తీసుకుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టించబడుతుందన్నారు. ఈ పథకం రూపకల్పన, ఎంపికైన వారికి శిక్షణపై తీవ్ర కసరత్తు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.6000 కోట్లు ఖర్చు పెడుతుందనీ, బ్యాంకర్లు రూ.1600 కోట్లు ఇవ్వడానికి ముందుకు రావాలన్నారు. ఈ పథకంలో భాగంగా లబ్దిదారులకు ప్రభుత్వ వాటా విడుదల చేయగానే బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని విడు దల చేయాలని కోరారు. ఈ పథకం కింద లబ్ది పొందే యువకులకు వ్యాపారం చేసుకోవడం, లాభాలు సాధించడం పైన అధికారులు కనీసం మూడు నుంచి 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారనీ, వ్యాపారంలో ఇబ్బందులు ఏర్పడితే శిక్షణ సంస్థలు మద్దతు ఇస్తా యని బ్యాంకర్లకు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో కమ ర్షియల్ బ్యాంకులు మాత్రమే ఉంటాయనీ, మరికొన్ని ప్రాంతాల్లో రూరల్ బ్యాంకులు మాత్రమే ఉంటాయనీ, ఈ పథకం విజయవంతం చేసేందుకు బ్యాంకర్లు పర స్పరం సహకరించుకోవాలని సూచించారు. ఈ పథ కాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లు, బ్యాంకర్లతో త్వరలో సమావేశం సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. అర్హులకు శాంక్షన్ లెటర్లు అందజేసిన తరువాత రాష్ట్రస్థాయిలో మరోసారి బ్యాంక ర్లతో సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# స్మితా సబర్వాల్‌కు పోలీసుల నోటీసులు

- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఏఐ చిత్రాన్ని ఆమె షేర్ చేశారంటూ నోటీసులు
- బీఎన్ఎస్ఎస్ 179 సెక్షన్ కింద నోటీసులు
- మార్చి 31న చిత్రాన్ని రీట్వీట్ చేసిన స్మితా సబర్వాల్

హైదరాబాద్, మనం ప్రతినిధిః కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఐఏఎస్ అధికారిణి, రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల అడవి విధ్వంసానికి సంబంధించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చిత్రాన్ని ఆమె పంచుకున్నారని చెబుతూ పోలీసులు ఈ నోటీసులు అందించారు. ఈ యేడాది మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన చిత్రాన్ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. అందులో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) మష్రూమ్ రాక్ వద్ద చాలా బుల్డోజర్లు ఉన్నట్లుగా ఉంది. వాటి ముందు నెమలి, జింక ఉన్నాయి. ఈ చిత్రంపై విచారణ జరిపిన పోలీసులు అది నకిలీ చిత్రమని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో బీఎన్ఎస్ఎస్ 179 సెక్షన్ కింద స్మితా సబర్వాల్‌కు నోటీసులు ఇచ్చినట్లు గచ్చిబౌలి పీఎస్ ఎస్‌హెచ్ఓ మహ్మద్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఒక కేసును దర్యాప్తు చేస్తున్న అధికారి సాక్షులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# గిరిజనలు పిల్లలను బాగా చదివించుకోవాలి

- గిరిజన హక్కులు,చట్టాల పై అవగాహన పెంచుకోవాలి
- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జడ్జి ఎం.ఎస్. భారతి

**చిత్తూరు, ఏప్రిల్ 16 మనం న్యూస్ :** గిరిజనుల హక్కులు చట్టాలపై గిరిజన ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి పేర్కొన్నారు. బుధవారం గంగాధర్ నెల్లూరు మండలం, కలిజీవేడు పంచాయితీ, కె.నాశంపల్లి ఎస్టీ కాలనీ నందు జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి ఎస్. మూర్తి, గ్రామ సర్పంచ్ నీలావతి తో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన హక్కులు చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గిరిజనుల హక్కుల చట్టాలపై గిరిజన ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజనుల హక్కులను కాపాడేందుకు మరియు వారి సంక్షేమం కోసం, భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చట్టాలను రూపొందించడం జరిగిందన్నారు.ముఖ్యమైన చట్టాలు పౌర హక్కుల రక్షణ చట్టం, అటవీ హక్కుల చట్టం, పంచాయతీ (స్థానీయం) చట్టం మరియు గిరిజన సంక్షేమ పథకాలు రాజ్యాంగంలో పొందుపరచడమైనదన్నారు. ఈ చట్టాలు గిరిజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను రక్షించడమే లక్ష్యంన్నారు.

**ముఖ్య చట్టాలు:**
**పౌర హక్కుల రక్షణ చట్టం :**

ఈ చట్టం షెడ్యూల్ తెగలపై జరిగే అఘాయిత్యాలను నిరోధించడానికి రూపొందించబడిందని. ఇది వారికి వ్యతిరేకంగా వేధింపులు, అవమానాలు మరియు వేధింపులను నిరోధించడంలో సహాయపడుతుందన్నారు.



**అటవీ హక్కుల చట్టం:**

ఈ చట్టం గిరిజనులకు మరియు అటవీ నివాసితులకు వారి భూమి, అటవీ వనరులపై హక్కులను కల్పిస్తుందని. గిరిజనులు అడవులలో నివసిస్తున్నందున, వారు అడవులను ఉపయోగించుకునే హక్కును కలిగి ఉంటుందని తెలిపారు.

**పంచాయతీ (స్థానీయం) చట్టం:**

ఈ చట్టం గిరిజన గ్రామ పంచాయతీలకు అధిక స్వయంప్రతిపత్తిని ఇస్తుందని. ఇది గిరిజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ నిర్ణయాలలో పాల్గొనడానికి సహాయపడుతుందన్నారు.

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల కోసం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని. విద్య, ఆరోగ్యం, ఉపాధి, గృహాలు మరియు ఇతర అవసరాలను తీర్చడానికి సహాయపడతుందన్నారు.

ఈ చట్టాలు మరియు పథకాలు గిరిజనుల సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ హక్కులను రక్షించడానికి సహాయపడతాయి మరియు వారి అభివృద్ధికి దోహదపడతాయిని తెలిపారు.

రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు గురించి అవగాహన చేసుకుని వాటికి అనుగుణంగా గిరిజనులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. గిరిజనులకు సంబంధించి ఏమైనా కోర్టులలో కేసులు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయం పొందవచ్చునని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల పిల్లల సంబంధించి పాఠశాలల్లో అనేకమైన సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పిల్లలందరినీ బడికి పంపించి బాగా చదివించుకోవాలన్నారు. చదువుకున్నప్పుడే మీ జీవితాలు మెరుగుపడతాయని సమాజంలో మీరు కూడా గౌరవంగా జీవించడానికి చదువు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 18 నుండి 21 సంవత్సరాలు నిండిన పిల్లలకు మాత్రమే వివాహాలు చేయాలని, 18 సంవత్సరాల కంటే ముందుగా వివాహాలు జరిపిస్తే తల్లిదండ్రుల పైన మరియు వారిని ప్రోత్సహించిన వారిపై కేసు నమోదు చేసి రెండు సంవత్సరాలు జైలు శిక్షతోపాటు లక్ష రూపాయలు జరిమానా విధించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చూచించారు. ఈ కాలనీకి సంబంధించి అందరికీ రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఉన్నాయా, అర్హులైన వారికి పెన్షన్ అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయని,అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కాలనిలో కొందరికి రేషన్ కార్డులు లేవని, ఈ కాలనీకి సంబంధించి బ్రెల గ్రౌండ్ లేదని,గుడికి స్థలం లేదని జడ్జి దృష్టికి తీసుకురాగా వీటికి సంబంధించి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. వీటికి సంబంధించి ఎలాంటి చర్య తీసుకున్నారు అన్న సమాచారాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ గారికి నివేదిక అందజేయాలని రెవిన్యూ అధికారి ని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రానికి సంబంధించి చిన్నపిల్లలకు గర్భవతులకు ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, చిక్కీలు సక్రమంగా మీకు అందిస్తున్నారని వారిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి ఎస్. మూర్తి మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎస్టీ కాలనీకి సంబంధించి బ్రెల గ్రౌండ్ లేక ఇబ్బంది పడుతున్నారు అన్న సమస్యను ఇప్పుడే జడ్జి గారికి దృష్టికి తీసుకు వచ్చారని, దీనిపై రెవెన్యూ అధికారులతో మాట్లాడి బ్రెల గ్రౌండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో గిరిజన పిల్లల విద్యార్థులకు గురుకుల వసతి గృహాలు ఉన్నాయని, అక్కడ పిల్లలను చేర్పించి బాగా చదివించుకోవాలని వారికి సూచించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య,ఐ సి డి ఎస్, సూపర్వైజర్ సంధ్య విఆర్ఓ .ఫాతిమా, డాక్టర్ శ్రీనివాసులు,మెడికల్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరుణాకర్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- ఏపీ వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్

**తిరుపతి, ఏప్రిల్ 16 మనం న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానంపై టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి అవాస్తవాలు ప్రచారం చేయడం సిగ్గుచేటని, ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ఏపీ వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ హితవు పలికారు. బుధవారం తిరుచానూరులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవిత్రమైన టీటీడీని భ్రష్టు పట్టించిన ఘనత వైసీపీ కే దక్కుతుందని దుయ్యబట్టారు. టీటీడీకి సంబంధించిన గోశాలలో అనారోగ్యంతో పదుల సంఖ్యలో గోవులు మరణిస్తే,



కరుణాకర్ రెడ్డి వందలాది గోవులు మరణించాయని గోబెల్స్ ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. నగరి, నిమ్మకూరు, ఒంటిమిట్ట ప్రాంతాలోని గోశాలలో గోవులు లేకపోయినప్పటికీ నిర్వహణ ఖర్చుల పేరుతో 1.78 కోట్లు రూపాయలు స్వాహ చేసారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీటీడీ పారదర్శకమైన పాలన అందిస్తుంటే కరుణాకర్ రెడ్డి తన శిష్యుడు హరనాథ్ రెడ్డిని కాపాడడానికి తెర వెనుక అవస్తావాలు ప్రచారం మొదలుపెట్టారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ సతీమణి తిరుమలకు వచ్చిన సమయంలో డిక్లరేషన్ పై సంతకాలు చేసి శ్రీవారిని దర్శించుకున్నారని, వైఎస్ జగన్ ఒక్కసారి కూడా డిక్లరేషన్ ఇవ్వని పాపాన పోలేదన్నారు. కరుణాకర్ రెడ్డి కూడా క్రైస్తవ మతంకు చెందిన వారని, ఆయన కూడా డిక్లరేషన్ పై సంతకం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కే.జయచంద్ర నాయుడు, బీసీ నేత బాలు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసాలతో రాజకీయాలొద్దు

- గోశాలలో పశువుల నిర్వహణ సక్రమంగానే ఉంది
- వయస్సు మీరిన, అనారోగ్యంతోనే కొన్నిమృతి చెందినట్లు తెలుస్తోంది
- టీటీడీ ప్రపంచ ప్రఖ్యాత ధార్మిక సంస్థ
- లోపాలుంటే సరిచేసుకొనే విధానాన్ని అనుసరించాలి
- ఫక్తు రాజకీయాలు ఇలాంటి చోట తగదు
- రాజకీయ పార్టీలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హితవు

**తిరుపతి, ఏప్రిల్ 16 మనం న్యూస్ :** ప్రపంచ ప్రఖ్యాత ధార్మిక సంస్థపై ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉంటారని, అదే తీరున టూరిజం కూడా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో రాజకీయాలు చేయడం తగదని వివిధ రాజకీయ పార్టీలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హితవు పలికారు. గత నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎస్వీ గోశాలలో గోవుల మృత్యువాత పడడంపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా బుధవారం ఆయన ఎస్వీ గోశాలను సందర్శించారు. అక్కడ గోశాల నిర్వహణ, గోవులకు అందిస్తున్న దాణా, మేత, డైరీ నిర్వహణ తీరును స్థానిక సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎస్వీ గోశాలలోని వివిధ రకాల పశువులు, వాటి ఆహారం, సంరక్షణ వివరాలను ఆరాదీశారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోశాలలో పనిచేస్తున్న కార్మికులు పలు విషయాలను నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో డైరీ నిర్వహణలో లోపాలు ఉండేవని, అవకతవకలు, అవినీతి చోటు చేసుకున్నట్లు వివరించారు. పశువుల దాణా విషయంలోనూ అనేక ఇబ్బందులు ఉండేవని ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ప్రతి గోవుకు సరిపడా ఆహారం, దాణా వేస్తున్నట్లు వివరించారు. అయితే గత గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిపై పలు అంశాలను నారాయణ దృష్టికి తీసుకువచ్చారు. మేలైన గోవులను బయట ప్రాంతాల నుంచి కొనుగోలు చేసే క్రమంగా అవినీతి జరిగిందని, రూ.60 నుంచి రూ.90వేల విలువైన గోవులను అధిక మొత్తంలో రూ.2లక్షల వరకు బిల్లులు చేసుకున్నట్లు అక్కడి సిబ్బంది చెప్పుకొచ్చారు. గత డైరెక్టర్ హయాంలో కాలం చెల్లిన దాణాలో పురుగులు పడినప్పటికీ సరైన విధంగా చర్యలు చేపట్టేవారు కాదని వాపోయారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కొంత మేరా మెరుగుపడ్డాయని చెప్పారు. ఇటీవల మృత్యువాత పడ్డ గోవులు వయస్సు మీరినవి, అనారోగ్యంతో మరణించినట్లు నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం డైరీలో పనిచేస్తున్న టైం స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భద్రత లేదని, ఉద్యోగంలో ఉంటూ వివిధ కారణాల చేత మరణించిన వారికి కూడా ఎలాంటి సాయం చేయలేదని అక్కడి గోశాల కార్మికులు వివరించారు. గోశాల



పరిశీలనానంతరం సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మీడియా సమావేశం నిర్వహించి ఆయన పరిశీలించిన అంశాలను పేర్కొన్నారు. ప్రపంచ నలు మూలల నుంచి తిరుమల క్షేత్రం దర్శనార్థం, ఇక్కడి ప్రదేశాలను సందర్శించడానికి పర్యాటకులు వస్తుంటారని, అయితే ధార్మిక సంస్థపై ప్రజల విశ్వాసాలున్న నేపథ్యంలో ఇలాంటి చోటును ఫక్తు రాజకీయాలకు వాడుకోవడం రాజకీయ పార్టీలకు తగదని హితవుపలికారు. రాజకీయాలుంటే బయట చూసుకోవాలని ప్రజల నమ్మకం ఉన్న చోట ఆరోపణలు, ప్రత్యారోపణలు, అలజడి వాతావరణం సృష్టించి లబ్ధిపొందాలనుకోవడం సమంజసం కాదని సూచించారు. నిర్వహణ లోపాలు, విధానపరమైన లోపాలు ఉంటే తగిన రీతిలో సరిచేసుకొనే మార్గాన్ని అనుసరించాలే తప్ప ప్రజలను ఆందోళన కలిగించే విధంగా భేషజాలు సృష్టించడం, రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గత నాలుగు రోజులుగా ఎస్వీ గోశాలలో గోవులు మృత్యువాత పడుతున్నాయంటూ.. అనేక ఆరోపణలు చేస్తూ ప్రజలు ఆందోళన కలిగేలా వార్తలు రావడం, పలువురు వ్యాఖ్యానించడం చూశానన్నారు. పవిత్రంగా భావించే గోవును కాపాడి, సంరక్షించే సదుద్దేశంతో గోశాలను నిర్వహించడం బాగానే ఉందన్నారు. ఎస్వీ గోశాలలో ప్రస్తుతం గోవుల సంరక్షణ సంతృప్తిగానే ఉందన్నారు. అక్కడ వైద్యులు, కార్మికుల పర్యవేక్షణలో గోవులకు సరిపడా దాణా, ఆహారం అందిస్తున్నట్లు తాము పరిశీలించినట్లు చెప్పారు. అయితే నిర్వహణలో లోపాలను టీటీడీ సరిచేయాలని సూచించారు. గోశాలలో పని చేస్తున్న టైం స్కేల్, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, టీఏ, డీఏ, పీఎఫ్ వర్తింపజేయడానికి టీటీడీ యాజమాన్యం దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల భద్రతపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి పి మురళి, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, కత్తి రవి,చంద్రశేఖర్ రెడ్డి,ఎన్ డి రవి ,కేవైరాజా ,శ్రీరాములు ,రామకృష్ణ,నాగరాజు తదితరలు పాల్గొన్నారు.

# ఆక్రమణతో ఇళ్ళు నిర్మించుకున్న వాటికి క్రమబద్ధీకరణకు సదవకాశం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్

**తిరుపతి,ఏప్రిల్16 మనం న్యూస్ :** నివాసం కోసం పేదలు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లోని వాటిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని, ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు.

బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు మీడియాతో జిల్లా కలెక్టర్ జెసి శుభం బన్సల్ తో కలసి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వు నంబరు 30, తేదీ: 29.01.2025 న ప్రభుత్వం జారీ చేసిన క్రమబద్ధీకరణ పథకం - 2025 (రెగ్యులరైజేషన్ స్కీం - 2025) కింద ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్న వారు ఎవరైనా ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే క్రమబద్ధీకరించి సంబంధిత దరఖాస్తుదారుడికి ఇంటి పట్టాను మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ పథకం 150 చదరపు గజాలు (స్క్వేర్ యార్డ్స్) లోపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరణ చేసి ఇంటి పట్టా మంజూరు చేస్తుందన్నారు.

2019 అక్టోబర్ 15 తేదీని కట్ ఆఫ్ డేట్గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తేదీ కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉన్నవారికి క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్లో నిర్దేశిత స్థలాలు, లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నా క్రమబద్ధీకరణకు అనర్హులని పేర్కొంటూ మార్గదర్శకాలు జారీ చేసిందని, 150 గజాల వరకూ ఉచితంగానే క్రమబద్ధీకరణ చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ పథకం కింద ఇంటి పట్టా మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, 151 నుండి300 చదరపు గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని, నివాసం ఏర్పరచుకొని ఉంటే బిపియల్ వారు 15 శాతం బేసిక్ వాల్యూ మరియు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు, అదే ఎపియల్ వారు ఐతే 15 శాతం బేసిక్ వాల్యూ మరియు యధావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు, 301 నుండి 450 చదరపు గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని, నివాసం ఏర్పరచుకొని ఉంటే బిపియల్ వారు 100 శాతం బేసిక్ వాల్యూ మరియు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు, అదే ఎపియల్ వారు ఐతే 200 శాతం బేసిక్ వాల్యూ మరియు యధావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు, 451 చదరపు గజాల పైన ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని, నివాసం ఏర్పరచుకొని ఉంటే బిపియల్ ఏపీఎల్ అని తేడా లేకుండా వారు బేసిక్ వాల్యూపై 5 రెట్లు చెల్లిస్తూ మరియు యధావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేయడం



జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు.

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు (బీపీఎల్) ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఇళ్లు, గుడిసెలు వేసుకొని ఉంటే అందులో 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. పేదలు కాని వారు ఉన్నా 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. దీనికోసం ఈ ఏడాది డిసెంబరు 31, 2025 వరకు గ్రామ,వార్డు సచివాలయాల్లో లేదా తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. వీటిపై గ్రామ వీఆర్వో, వార్డు అధికారులు విచారణ జరిపి ఆయా ప్రాంతాలను బట్టి తహసిల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారు. వాటిని సబ్ డివిజనల్ కమిటీలో చర్చించి ఆమోదిస్తారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపికపై ఆదేశాలు ఇస్తారు. వాటి ఆధారంగా తహసిల్దార్ కన్వీయెన్స్ డీడ్ల రూపంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారు. రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు ఇస్తారు. తాము ఆ ప్రాంతంలో నివసిస్తున్నట్టు ఆధారాలుగా రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ప్రాపర్టీ టాక్స్ రసీదు, కరెంటు బిల్లు రసీదు, నీటి పన్ను రసీదు తదితర ఏదో ఒక ఆధారం కలిగి ఉండాలని సూచించారు. ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు ఎంపికై న వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను రెండు వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. సీఎఫ్ఎంఎస్లో ఫీజులు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ క్రమబద్ధీకరణ పథకం 2025 ఒక మంచి సదవకాశమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# అలిపిరి టోల్ గేట్ ను ఆకస్మిక తనిఖీ చేసిన టీటీడీ సీవీఎస్వో, జిల్లా ఎస్పీ

**తిరుపతి,ఏప్రిల్ 16,మనం న్యూస్:** తిరుపతి లోని అలిపిరి టోల్ గేట్ ను టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ వి హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు మంగళవారం రోజున మహారాష్ట్రకు చెందిన అన్షుమన్ తరెజా అనే ఓ యూట్యూబర్ శ్రీవారి ఆలయం పై డ్రోన్ కెమెరా ఎగరవేసిన ఘటన కలకలం సృష్టించడంతో అలిపిరిలో భక్తులను తనిఖీ చేయు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలిపిరి టోల్



గేట్ లో స్కానర్ మానిటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతి ఒక వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించాలని అనుమానంగా ఉన్న వస్తువులను సిబ్బంది వేంటనే ఆ వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అప్రమత్తంగా ఉండాలని ఎస్.పి.ఎఫ్ సిబ్బంది మరియు విజిలెన్స్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే టోల్ గేట్ వద్ద తిరుమలకు వెళ్ళుతున్న భక్తుల వాహనాలు ఎలాంటి ఆలస్యం కాకుండా చూడాలని తిరుమలకు వెళ్ళుతున్న ద్విచక్ర వాహనాలు, కార్లులోని వస్తువులను సిబ్బంది ఎప్పటికప్పుడు చెకింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలిపిరి టోల్ గెట్ వద్ద విఐపి వాహనాలు, సామాన్య ప్రజల కార్లు వెళ్ళు మార్గంలతో పాటు ద్విచక్ర వాహనాలు వెళ్ళు మార్గాలను పరిశించి పలు సూచనలు చేశారు.

# లక్కి డ్రా పద్ధతిలో షాపుల కేటాయింపు

- మున్సిపల్ కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్

**కరీంనగర్ టౌన్,ఏప్రిల్16( మనంన్యూస్):** లక్కి డ్రా పద్ధతిలో శాతవాహన యూనివర్సిటీ వద్ద ఉన్న నగరపాలక సంస్థ షాపులను కేటాయించడం జరగిందని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలో గల కళాభారతి లో బుధవారం నగరపాలక సంస్థ కు చెందిన శాతవాహన యూనివర్సిటీ సమీపంలో గల షటర్లకు లక్కి డ్రా జరగింది. మొత్తం 26 షటర్లకు 261 మంది వ్యాపారులు దరఖాస్తులు చేస్కోగా నగరపాలక సంస్థ నిబంధనల ప్రకారం కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఆద్వర్యంలో రిజర్వేషన్ వారిగా లక్కి డ్రా తీసి షాపులను కేటాయించారు.

ఎస్సీ కెటగిరి కి 4,ఎస్టీ కెటగిరి కి 2, వికలాంగుల కెటగిరి 1, నాయిబ్రాహ్మన కేటగిరీ 1 కేటాయించగా మగిలిన వాటిని జనరల్ కెటగిరీలో డ్రా పద్ధతి లో కేటాయించారు. వారం రోజుల్లో షాపులు దక్కించుకున్న వారు నగరపాలక సంస్థ తో అగ్రిమెంట్ చేస్కోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కు చెందిన శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని 26 షాపులకు లక్కి డ్రా నిర్వహించామని రిజర్వేషన్



ప్రకారం మున్సిపల్ నిబంధన మేరకు మొత్తం షాపులను లబ్ధిదారులకు కేటాయించామని తెలిపారు. పారదర్శకంగా లక్కి డ్రా పద్ధతిని కొనసాగించి షాపులను కేటాయించామని తెలిపారు. గతంలో ఎక్కడైనా నగరపాలక సంస్థ కు చెందిన షాపులను పొందిన వారికి అవకాశం ఇవ్వకుండా కొత్త వ్యాపారులకు కేటాయించామని తెలిపారు. ఒక్క కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అవకాశం కల్పించామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ షాపులు పొందిన వారు నడపించకుండ వేరే ఇతరులకు అద్దెకు కేటాయిస్తే అలాంటిది మా దృష్టికి వస్తే సంబంధించిన షాపు యజమాని అగ్రిమెంట్ రద్దు చేసి వేరే ఇతరులకు కేటాయిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం షాపులను ఇతరులకు అద్దేకు ఇవ్వరాదని తెలిపారు. ఈ లక్కి డ్రా లో డిప్యూటీ కమీషనర్ స్వరూప రాణీ, ఆర్వో భూమానందం, రెవెన్యూ సిబ్బంది భూమయ్య తదతరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం ప్రతినిధి) :** కామారెడ్డి పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. నూతనంగా కొనుగోలు చేసిన నీటి ట్యాంకర్లకు బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించి,




పట్టణంలో నీటి సరఫరాకు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి పట్టణంలో ఇప్పటికే 8 ట్యాంకర్ల ద్వారా ఈ వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉన్న వార్డుల్లో నీటిని సరఫరా చేయడం జరుగుతున్నదని, పట్టణ విస్తీర్ణం పెరగడం, నీటి ఎద్దడి తలెత్తడంతో కొత్తగా 50 లక్షల రూపాయలతో ఐదు నీటి ట్యాంకర్లు కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఈ వేసవి కాలంలో నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో నీటిని సరఫరా చేసి ప్రజల సమస్యలను తీర్చాలని అధికారులకు సూచించారు. అలాగే 40 లక్షలతో కొనుగోలు చేసిన జె.సి.బి. కి కూడా పూజ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్.ప్రక్రియ కొనసాగే నా తీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని మున్సిపల్ బోర్ల నుండి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న వాటిని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, హౌసింగ్ పిడి విజయ్ పాల్ రెడ్డి, మున్సిపల్ ఏఈ శంకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాంత్రిక లోకం

అందరమూ పక్కపక్కనే కూర్చుంటాం
ఎవరిలోకంలోవాళ్లం
విహరిస్తుంటాం
అన్ని బంధాలు
ఫోను బంధం ముందు దిగదుడుపే
ఎవరున్నాపోయినా బతుకొచ్చు
పిల్లపోయినా తల్లి పోయినా
ఎవరు పోయినా దిగులు లేదు
అదొక్కటి వుంటే చాలు
అదిలేని బతుక్కు అర్థంలేదు
ఒకరికళ్లకు మరొకరు కనపడరు
చూసేవాళ్లకు వాళ్లున్నారు
తాము ఉన్నట్టు వాళ్లకు తెలియదు
అంత ఏకాగ్ర ప్రపంచం
మరెక్కడా చూడం
ఎవరీ లోకం నుంచి
సెలవుతీసుకున్నా ఏమీకాదు
ఏగుండే చెరువు కాదు
ఫోను ఆన్ చేస్తే చాలు..
ఇపుడు మనిషి ఒంటరి కాదు
ఓదార్చే అవసరంలేదు జీవన్ మృతులకు
ఏ బంధాలూలేవు
ఫోను బంధం తప్ప

- హిమజ్వాల

## నిర్వచనం

కవిత్వం
వికసిత పుష్పం
పరిమళం దాని భాష
ఆకర్శిత నైజం ఒంటిగుణం
కొండ, పిట్ట, మేఘం,జలం, నరుడు
పంచ ప్రాణాలు
వాటికి
జవం, జీవనం
సవ్యంగా, నవ్యంగా అందించటమే
దాని పని, పనితనం

- దాసరాజు రామారావు

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# సంస్కర్త వీరేశలింగం పంతులు

**'తన దేహము తన గేహము**
**తన కాలము తన ధనంబు తన విద్య జగ**
**జ్జనులకే వినియోగించిన**
**ఘనుడీ వీరేశలింగకవి జనులార!'**

వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. వీరి పూర్వీకులు ఇప్పటి ప్రకాశం జిల్లాలోని కందుకూరు గ్రామం నుండి రాజమండ్రికి వెళ్ళడం వలన వారికి ఈ ఇంటి పేరు స్థిరపడిపోయింది. కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహితీ రంగంలో ఎక్కువగా కృషి చేసాడు. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు. వీరేశలింగం స్త్రీ విద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టాడు కూడా. అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా చేర్చుకుని మిగతా పిల్లలతో కలిపి కూర్చోబెట్టేవాడు. వారికి ఉచితంగా చదువు చెప్పడంతో పాటు పుస్తకాలు, పలకా బలపాలు కొనిచ్చేవాడు.

ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపించాడు. యువజన సంఘాల స్థాపన కూడా వీరేశలింగం తోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి (హితకారిణీ సమాజం 1905) అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేసాడు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పనిచేసాడు. ఆయన 130కి పైగా గ్రంథాలు రాసాడు. అన్నీ తెలుగులో అరుదైనగ్రంథాలే. రాజశేఖర చరిత్ర అనే నవల, సత్యరాజా పూర్వ దేశయాత్రలు ఆయన రచనలలో ప్రముఖమైనవి. అనేక ఇంగ్లీషు, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. బడి పిల్లల కొరకు వాచకాలు రాసాడు. స్వీయ చరిత్ర వ్రాసాడు. ఆంధ్ర కవుల చరిత్రను కూడా ప్రచురించాడు

వీరేశలింగం చదువుకునే రోజుల్లో కేశుబ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు మొదలైన వాటి మీద నమ్మకం తగ్గడమే కాక, దయ్యాలు, భూతాలు లేవనే అభిప్రాయానికి వచ్చాడు. ప్రజలకు అది నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి వెళ్ళేవాడు. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు, సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చెయ్యడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించాడు. సంఘం లోని అవకతవకలను ఎత్తి చూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం వివేకవర్ధని లక్ష్యాలని ఆయన మొదటి సంచికలో తెలియజేసాడు. చెప్పడమే కాదు, అలాగే నడిపాడు కూడా. వివేక వర్ధని అవినీతిపరుల పాలిట సింహస్వప్నమయింది.

కందుకూరికి సమకాలిక ప్రముఖుడైన కొక్కొండ వెంకటరత్నం పంతులుతో స్పర్ధ ఉండేది. కందుకూరి వివేకవర్ధని స్థాపించిన తరువాత కొక్కొండ హాస్య వర్ధని అనే పత్రికను ప్రారంభించాడు. ఆ పత్రికకు పోటీగా కందుకూరి హాస్య సంజీవిని అనే హాస్య పత్రికను ప్రారంభించాడు. తెలుగులో మొట్టమొదటి ప్రహసనాన్ని కందుకూరి ఈ పత్రికలోనే ప్రచురించాడు. ఎన్నో ప్రహసనాలు, వ్యంగ్య రూపకాలు ఈ పత్రికలో ప్రచురించాడు.

ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపించాడు. యువజన సంఘాల స్థాపన కూడా వీరేశలింగం తోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి (హితకారిణీ సమాజం 1905 లో) అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేసాడు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ



కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పనిచేసాడు. తాను నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తూచ తప్పకుండా పాటించిన వ్యక్తి ఆయన.

**సంఘ సంస్కరణ కార్యక్రమాలు**

వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషులతో పెనవేసుకు పోయింది. ఒకదానినుండి మరో దానిని విడదీసి చూడలేము. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి. అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి తన సంస్కరణాభిలాషను నిరూపించుకున్నాడు.

వివేకవర్ధని పత్రిక ద్వారా అవినీతిపరులపై యుద్ధం సాగించి వారిని హడలెత్తించాడు. సంఘంలోని ఇతర దురాచారాలపై ప్రజలను చైతన్యవంతులను చెయ్యడానికి పత్రికను ఆయుధంగా వాడుకున్నాడు. సంఘసంస్కరణకై ప్రవచనాలు మాత్రం చెప్పి ఊరుకోలేదు, స్వయంగా అందుకై నడుం కట్టి కార్యరంగంలోకి దూకాడు. ఆ రోజుల్లో స్త్రీలకు విద్య అవసరం లేదని భావించేవారు. వీరేశలింగం స్త్రీవిద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, కుల నిర్మూలనకు ఆయన అకుంఠిత దీక్షతో పనిచేసాడు. వేశ్యా వ్యవస్థ పాతుకుపోయిన ఆ రోజుల్లో దానికి వ్యతిరేకంగా వివేకవర్ధనిలో వ్యాసాలు రాసాడు.

ఆయన చేసిన ఇతర సంస్కరణ కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని ప్రచారం చేసాడు. 1881 డిసెంబరు 11న తమ ఇంట్లో మొట్టమొదటి వితంతు వివాహం చేశాడు. తొమ్మిదేళ్ళ బాల వితంతువు గౌరమ్మ తిరువూరు తాలూకా రేపూడికి చెందిన పిల్ల. వరుడు గోగులపాటి శ్రీరాములు. ఈ పెళ్ళి పెద్ద ఆందోళనకు దారి తీసింది. పెళ్ళికి వెళ్ళినవాళ్ళందరినీ సమాజం నుండి వెలి వేశారు. సమాజం నుండి ఎంతో ప్రతిఘటన ఎదురైనా పట్టుబట్టి సుమారు 40 వితంతు వివాహాలు జరిపించాడు. పైడా రామకృష్ణయ్య, ఆత్మూరి లక్ష్మీ నరసింహం, బసవరాజు గవర్రాజు వంటి మిత్రులు, ఆయన విద్యార్థులూ వీరేశలింగానికి అండగా నిలిచారు. ఆయన భార్య కందుకూరి రాజ్యలక్ష్మమ్మ భర్తకు బాసటగా ఉంది. స్త్రీల కొరకు సతీహిత బోధిని అనే పత్రికను కూడా నడిపాడు. 1887 సంవత్సరంలో సంఘ సంస్కరణ సమాజాన్ని స్థాపించి, మతమనే ముసుగులో అధోగతిలో ఉన్న హైందవ సమాజంలోని దురాచారాలపై విప్లవం ప్రారంభించాడు. మూఢ విశ్వాసాలు, సనాతనాచారాలపై ఆయన ఎదురొడ్డి నిలిచాడు.

సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసాడో, సాహిత్యంలోనూ అంతే కృషి జరిపాడు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవాడు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవాడు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకడు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో ప్రతిభ కలవాడు కందుకూరి.

ఆయన 130 కి పైగా గ్రంథాలు వ్రాసాడు. అన్ని గ్రంథాలు వ్రాసిన వారు తెలుగులో అరుదు. రాజశేఖర చరిత్ర అనే నవల, సత్యరాజా పూర్వ దేశయాత్రలు ఆయన రచనలలో ప్రముఖమైనవి. అనేక ఇంగ్లీషు, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. బడి పిల్లల కొరకు వాచకాలు రాసాడు. స్వీయ చరిత్ర రాసాడు. ఆంధ్ర కవుల చరిత్రను కూడా ప్రచురించాడు. సంగ్రహ వ్యాకరణం వ్రాసాడు. నీతిచంద్రిక (తెలుగు పంచతంత్రం) లోని సంధి, విగ్రహం భాగాలను చిన్నయసూరి వదిలివేయగా వీరేశలింగం పూర్తి చేసాడు.

రాజశేఖర చరిత్రము - తొలి తెలుగు సాంఘిక నవల. ఆంగ్లంలో ఆలివర్ గోల్డ్‌స్మిత్ వ్రాసిన 'వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్' అనే నవలకూ దీనికీ కొన్ని పోలికలున్నాయి. అయితే ఆ నవల కొంత ఉపకరించిందనీ, కాని ఇది అనువాదం కాని అనుకరణ కాని కాదని వీరేశలింగం చెప్పాడు.

సత్యరాజా పూర్వదేశ యాత్రలు-ఆంగ్లంలో 'జోనాథన్ స్విఫ్ట్' రాసిన 'గల్లివర్స్ ట్రావెల్స్' ఆధారంగా రాశాడు. ఇందులో సమాజపు వికృత సంఘటనలను అవహేళన చేశాడు. 'ఆడ మళయాళం' అనే పదం ఇందులోంచే వచ్చిందే. ఈ రచయిత సాంఘిక అనర్థములను దునుమాడెను' అని 'రాయసం వెంకట శివుడు' ప్రశంసించాడు. సుమారు 50 కి పైగా రాసిన ప్రహసనాలు 'హాస్య సంజీవని' పేరుతో మూడు భాగాలుగా ప్రచురితమయ్యాయి.

**(నేడు వీరేశలింగం పంతులు జయంతి 1848 ఏప్రిల్ 16)**

**- తంగెళ్లపల్లి దీప్తి**

# గ్రూప్-1పై ఆది నుంచీ అనుమానాలు



రాష్ట్రంలో ఉన్నతమైన పరిపాలన ఉద్యోగంగా గ్రూప్-1ను భావిస్తారు. ఆ సర్వీస్ సాధించాలని,మెజార్టీ నిరుద్యోగుల కల. ఈ క్రమంలో మూడేళ్ల కింద వేసిన గ్రూప్ -1 నోటిఫికేషన్ కు గతేడాది అక్టోబర్ లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ మూడేళ్ల ప్రయాణంలో ఈ నోటిఫికేషన్ అనేక అవాంతరాలను ఎదుర్కొన్నది. ప్రిలిమ్స్ ఎగ్జామ్ లీక్ కావడం, తదుపరి కొత్త నోటిఫికేషన్ రావడం ఇలా అనేక సమస్యలతో ముందుకు సాగింది. ఈ క్రమంలో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ సెలక్షన్ కు జీవో 29ను తీసుకురావడం జరిగింది. సామాజిక న్యాయానికి విరుద్ధంగా జీవోను తీసుకురావడం జరిగింది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. అయినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకెళ్లి మెయిన్స్ పరీక్ష నిర్వహించింది. ఇప్పుడు మెయిన్స్ పరీక్ష అనంతరం తుది ఫలితాలు విడుదల చేసింది. ఇక్కడ కూడా గందరగోళ పరిస్థితులను నెలకొన్నాయి. పరీక్ష ఫలితాల్లో దాదాపు 80 నుంచి 90 శాతం వరకు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అధిక మార్కులు రావడం జరిగింది. వారికే సర్వీస్ వస్తుంది. తెలుగు మీడియం విద్యార్థులలో కేవలం 10 నుంచి 20 శాతం లోపు విద్యార్థులకే సర్వీస్ వస్తుంది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో భారీ లోటుపాట్లు జరిగాయని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు హైకోర్టులో కేసులు కూడా వేశారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీస్తుంది. అంతేకాకుండా భారీ స్కాం కూడా జరిగిందని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మరి దీనంతటిని చూస్తే అసలు గ్రూప్- 1 నియామకంలో పారదర్శకత ఏ మేరకుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడు గ్రూప్-1 మెయిన్స్ రాసిన వేలాది మంది విద్యార్థులు నైరాశంలోకి వెళ్లారు. దీని ప్రభావం తెలుగు మీడియం విద్యార్థులపై చాలా ఉంది.

**ఆది నుంచి అనుమానాలు**

ప్రతిష్టాత్మక భావించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో విద్యార్థులకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ సెలక్షన్లో జీవో 29 తీసుకురావడమే దీనికి కారణం. ఈ జీవోతో సామాజిక రిజర్వేషన్లుకు తూట్లు పొడిచారు. దీని ద్వారా ముఖ్యంగా ఎస్సీ ఎస్టీలను మరియు బీసీలకు కూడా అన్యాయం జరిగింది.ఈ జీవో ప్రభావం తుది ఫలితాలపై కూడా పడింది. ఇక్కడ సామాజిక వర్గాల వారీగా సెలక్షన్స్ తగ్గిపోయాయి. ఓపెన్ అభ్యర్థులకు ఎక్కువ అవకాశాలు ఏర్పడ్డాయి. టాప్ 100 లో ఎస్సీ ఎస్టీ సెలక్షన్స్ వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. బీసీలలో కూడా అంతగా లేరు. నాన్ లోకల్ వారికి అవకాశాలు పెరిగాయి. ఇంత ప్రభావాన్ని చూపిన జీవో 29 పై అటు ప్రభుత్వం, ఇటు కోర్టులలో కూడా చర్చకు రాకపోవడం విస్మయం కలిగిస్తుంది. చట్టాలు, శాసనాల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నించే కోర్టులు జీవో 29పై చర్చించకపోవడం అభ్యర్థుల్లో కోర్టులపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఇప్పటికే జీవో 29 రద్దు చేయాలని ఢిల్లీలో గత కొన్ని రోజులుగా విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. జీవో 29ను రద్దుచేసి పాత జీవో 55 ప్రకారం మెయిన్ సెలక్షన్ లిస్ట్ తీయాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే సామాజిక న్యాయం చేకూరుతుంది.

**మీడియం ప్రధాన సమస్యగా మారింది**

తెలంగాణ ప్రాంతంలో తెలుగు అధికారిక భాషగా ఉంది. దాదాపు 40 శాతం మంది విద్యార్థులు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు తెలుగులో రాశారు. కానీ చివరికి ఫైనల్ సెలక్షన్ వచ్చేసరికి కేవలం 10 నుంచి 20 శాతం మాత్రమే తెలుగు మీడియం ఎంపిక అవుతున్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు అధికంగా ఎంపిక కావడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా ఇక్కడ మూల్యాంకనం సరిగ్గా జరిగిందా? జరగలేదా అనేది ప్రశ్నార్ధకంగా మారింది. కేవలం మూడు నెలల సమయంలోనే 21 వేల మంది విద్యార్థుల పేపర్లు ఎలా దిద్దారు అనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు కొందరు పక్క పక్కన ఉన్న విద్యార్థులకు ఒకే రకమైన మార్కులు రావడం, కొన్ని ఎగ్జామ్స్ సెంటర్లోనే అత్యధిక మార్కులు రావడం వంటి సంఘటన పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి. నామమాత్రం రాసిన సగటు ఇంగ్లీష్ మీడియం అభ్యర్థికి వచ్చిన మార్కుల కన్నా ఎంతో విశ్లేషణాత్మకంగా రాసిన తెలుగు మీడియం అభ్యర్థులకు రాకపోవడం విస్మయం కలిగిస్తుంది. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులే తెలుగు మీడియంలో రాస్తుంటారు. వీరికి తీవ్ర అన్యాయం జరిగింది. అంతేకాకుండా ఉర్దూ మీడియంలో రాసిన 9 మంది విద్యార్థుల్లో దాదాపు 6 నుంచి 7 గురు విద్యార్థులకు సర్వీస్ వచ్చే అవకాశాలు ఉన్నాయని చర్చ. అసలు తెలుగు మీడియంలో మెటీరియల్ లభించడమే గగనంగా మారింది. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, గవర్నెన్స్, పర్యావరణంలో సరైన మెటీరియల్ తెలుగులో ఇప్పటికీ లేదు. అలాంటిది ఉర్దూ మీడియంలో ఎలా లభించింది? యూ పి ఎస్ సి సివిల్ సర్వీస్ మెయిన్స్ లో 50 శాతం మార్కులు దాటడమే కష్టం. అలాంటిది టీజీపీఎస్సీ మూల్యాంకనంలో 60 శాతం మార్కులు దాటడం లోప భూయిష్టమైన మూల్యాంకనానికి నిదర్శనం. మెయిన్స్ పరీక్ష అనేది అభ్యర్థుల జీవితాలను తీర్చిదిద్దే. అలాంటిది ఇష్టారీతిన జరిగిన మూల్యాంకనం వల్ల మెజార్టీ అభ్యర్థులు నష్టపోయారు. ముఖ్యంగా తెలుగు మీడియం వాళ్లకు తీవ్ర నష్టం జరిగింది. భవిష్యత్తులో తెలుగులో గ్రూప్-1 రాయాలంటే భయపడుతున్నారు. కావున ప్రస్తుతం విద్యార్థులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఒక 12 సంవత్సరాల తర్వాత గ్రూప్- 1 నోటిఫికేషన్ పడింది.

మెయిన్స్ మూల్యాంకంలో ఇష్టా రీతిన మార్కులు వేసి నాణ్యతకు పాతర వేశారు. నాణ్యతలేని విద్యార్థులకు సర్వీసు వస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. గ్రూప్-1 పోస్టులకు విలువ తగ్గిపోతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి నిరుద్యోగుల పక్షాన నిలబడాలి. అభ్యర్థుల అసహనం చెలరేగితే దాని ప్రభావం ఎలా ఉంటుందో గత ప్రభుత్వం కూడా చూసింది. మూల్యాంకన వ్యవస్థలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే మెయిన్స్ పరీక్ష విధానంలో మార్పులు తీసుకురావాలి. ముఖ్యంగా ప్రమాణాలతో కూడిన ప్రశ్నలు అడుగుతూ ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్న పత్రాన్ని తీసుకురావాలి. గ్రూప్- 1పై ఉన్న అనుమానాలు, ఆందోళనలన్నీ తొలగించాలి. అవసరమైతే యూపీఎస్సీ సహాయం తీసుకోవాలి. నియామకాలలో పారదర్శకత ఉన్నప్పుడే అభ్యర్థులకు భవిష్యత్తు నియామకాలలో చదవడానికి ఆసక్తి చూపెడతారు.ప్రభుత్వాలు కూడా ప్రశాంతంగా ఉంటాయి .

**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428

## అగ్నిపరీక్ష



అడుగు బయట పెడితే అగ్గిగుండం తొక్కినట్టు
అరికాళ్ళు బూరెల్లెక్క ఉబ్బుతున్నయి

అతి దాహం సూర్యుడు
త్రాగడానికి చెరువు నీళ్ళు సరిపోక
ఒంట్లో ఉన్న నీరంతా జుర్రుతున్నడు

నీళ్ళముఖం చూడక ఏండ్లు ఏండ్లయినట్టు
చలివేంద్రం కనబడితే కుండెడు నీళ్ళు
ఖతమవుతున్నయి
నీళ్ళదాత సుఖీభవ సుఖీభవా అని
లేచొచ్చిన ప్రాణం దీవిస్తున్నది

అటుపక్క
ఎర్రగా కోసి పెట్టిన పుచ్చకాయ ముక్కలు
ఇటుపక్క ఐస్క్రీమ్ బండి
మరుగు మందు ఏదో పెట్టినట్టు

వశీకరణ మంత్రం చదువుతున్నట్టు
మనసు లొట్టలేసుకుంటూ
నాలుక చప్పరిస్తూ అటూ ఇటూ
పరుగెడుతున్నది

గోలిసోడా
నిమ్మా, చెరుకు, పండ్ల రసాలు
రా..రా... అంటుంటే
జేబు ఖాళీ అయ్యి
ఈ జన్మకు ఇది చాలు అనిపిస్తున్నది

గెలలు గెలలుగా కొబ్బరి బోండాలు
దారి పొడవునా దర్శనమిస్తుంటే
వాని చేతిలో ఉన్న బోండాలు నరికే కత్తి
అందుకుని
వాని పీక మీద పెట్టి
చెంబెడు ఆకాశగంగ

గట గటా గొంతులో పోసుకోవాలనిపిస్తుంది
చెట్టు మీది ఆకు కదుల్త లేదు
గూడు వొదిలి పిట్ట ఎగుర్త లేదు
పొగలు కక్కుతున్న రోడ్డు మీద
మనిషి జాడ లేదు

వడ్లు చల్లితే పేలాలు అవుతున్నయి
గుడ్డు కొడితే ఆమ్లెట్టు అవుతున్నది
ఇట్లా కోసి అట్లా ఆరబోసిన గుమ్మడి పచ్చెలు
వొడియాలవుతున్నయి
పచ్చాపలు
నూనె ఖర్చు లేకుండా ఫ్రై అవుతున్నయి

గడప దాటితే
పెంక మీది రొట్టెలా వొళ్ళు మాడిపోతున్నది
మీసం తిప్పే మొనగాడు కూడా
నీడకు పరుగెడుతున్నడు

పాపం
పొద్దస్తమానం పూలో పండ్లో నమ్ముకున్న
బ్రతుకు
బండలు పగిలేలా కురుస్తున్న ఎండకు
ఎట్లా తలాడిస్తున్నదో.

**- గజ్జెల రామకృష్ణ**

# సామాన్యుని వెతలు తీరేది ఎప్పటికి?



స్వల్ప దూర ప్రయాణాలకు తప్పనిసరిగా సాధారణ టికెట్స్, దూర ప్రాంత ప్రయాణాలకు సాధారణ లేదా ముందస్తు రిజర్వేషన్ ద్వారా టికెట్లను పొందాలి. సాధారణ ప్రయాణికిని బాధలు వర్ణనాతీతం. లోతుగా విశ్లేషించడానికి ప్రయాణంలో టికెట్ బుకింగ్ నుండి గమ్యం చేరే వరకు సామా న్యుడు అనుభవిస్తున్న వెతలను చూద్దాం. టికెట్ అనేది స్టేషన్ కౌంటర్ లేదా ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చు. ఇక్కడి నుండే బాధలు మొదలవుతాయి. కౌంటర్ దగ్గర చేంతా డంత లైన్ ఉంటుంది. జనాలను కంట్రోల్ చేసేందుకు రైల్వే పోలీసులు ఉండరు. మరి స్త్రీల పరిస్థితి చెప్పనలవి కాదు. స్టేషన్లలో అద్భుతమైన సౌకర్యాలను చదవడానికి బాగుంటాయి. ఉన్నోడు గొంతు తడుపుకోడానికి బాటిల్ నీరు కొనుక్కుం టాడు. సామాన్యునికి తాగునీరు నల్లాలుంటాయి. మంచిదే ! కానీ వచ్చే నీరు మంచిదో? కాదో? తాగినవారికి బాగా తెలు స్తుంది. పొట్ట నింపుకోడానికి ఏది కొందామన్నా స్పెషల్ ధరలు. ప్లాట్‌ఫామ్ మీద కొన్నిసార్లు పులిసిపోయిన, పాడైపోయిన ఆహా రం అమ్ముతారు. ధరలు మాత్రం అడక్కండి. ఎప్పటి కప్పుడు ధరలు ఫ్రెష్‌గా ఉంటాయి. మూత్రానికి వెళ్ళాలన్నా ' పే అండ్ యూజ్' అనే బోర్డులు కనిపిస్తాయి. దీనర్థం తెలియని సాధారణ ప్రయాణికునికి అక్కడికి వెళ్ళేవరకూ వరకూ తెలియదు. దీనికి కూడా రుసుము చెల్లించాలా? అని! ఉచిత మూత్రశాలల గురించి చెప్పనవసరం లేదు! చెప్పనలవి కాదు! అందుకే చాలా మంది బహిరంగ మల మూత్ర విసర్జన చేస్తారు. కొన్ని స్టేషన్లలో రైలు బండి వచ్చే ముందు మాత్రమే అనౌన్స్ చేస్తారు. బోగీ సంఖ్యని ప్రదర్శించే బోర్డు ఉండదు. బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియదు. జనరల్ బోగీ కోసం సామాన్యుడు పరుగులు పెట్టాల్సిందే. తప్పదు ! ఎందుకంటే సామాన్యుడు పేదవాడు కదా ! ఇటువంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు ప్రమాదా లు జరుగుతున్నాయి. ఇలా బండి తప్పిపోయిన వారెందరో? ఈ పరుగులో ఒక్కోసారి చచ్చినోళ్ళు కూడా ఉంటారు. సాధారణ ప్రయాణీకుడు జనరల్ బోగీలోనే వెళ్ళే స్థోమత ఉంటుంది. ప్రతీ స్టేషన్లో పరిమితికి మించి సాదారణ టికెట్స్ ఇస్తారు. ఒక్కో బండిలో గరిష్టంగా జనరల్ పెట్టెలు నాలుగు ఉంటాయి. మరి ఈ నాలుగు బోగీలు అందరికీ సరిపోతాయా? ఇక బోగీలోని అవస్థలను చూద్దాం.

భారత దేశంలో జనాభా పెరిగింది కదా అనే విషయం స్పష్టంగా కనిపించేటట్టు జనాలు కిక్కిరిసి ఉంటారు. ఎంత మంది వచ్చినా ఇంకా ఖాళీ ఉండడానికి.పురాణాలలో ఉండే పుష్పక విమానం కాదు కదా! లోపల సౌకర్యాలు గురించి ప్రస్తావించాలంటే ఈ పేపరు చాలదు. కాలుకదప వీలుకాదు. చంటి పిల్లలు, వృద్ధులు, మహిళల వెతలు చెప్పలేం. రాత్రి వేలైతే ప్రయాణీకుల పరిస్థితి ఘోరంగా ఉంటుంది. కనీసం మరుగుదొడ్డికి వెళ్లాలంటే వీలవదు. అక్కడ కూడా జనాలే. బాత్రూంలో నీరు కొంత సమయం వరకే వస్తుంది. తరువాత షరామామూలే. ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే.

ఇక ముందస్తు (రిజర్వేషన్) టికెట్స్ గురించి చూద్దాం. ఆన్‌లైన్ లేదా స్టేషన్ కౌంటర్ దగ్గర బుక్ చేసుకునే వీలుంటుంది. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే సామర్థ్యం ఎంత మంది సామాన్యులకు ఉంటుంది. పోనీ ఇంటర్నెట్ సెంటర్ వాడిని ఆశ్రయిస్తే మన పేరిట ముందుగా 'ఐడి'ని సృష్టించాలి. దీని కోసం ప్రయాణికునికి ఫోన్, ధర చెల్లించడానికి ఎటిఎం కార్డ్ ఉండాలి. ఇవి ఎంతమందికి ఉంటాయి. ఎంతమంది ప్రయాణీకులు అరవై రోజుల ముందే ప్రయాణానికి ప్రణాళిక చేయగలరు. అవసరాలు ముందే తెలియవు కదా. ఎందుకోగానీ ఈ మధ్యన ఇలా టికెట్స్ ఓపెన్ అవ్వంగానే బుక్ అయిపోతున్నాయి. రెండు నెలల ముందే రైల్వే శాఖ దగ్గర పెద్ద మొత్తంలో టికెట్ అమౌంట్ నిలువ చేయడం వలన వారికి వడ్డీ బాగానే వస్తుంది. కానీ సామాన్యులు అంత పెద్ద మొత్తంలో ముందుగానే మదుపు పెట్టాలంటే కష్టం. అప్పులు చేయక తప్పదు. ఒక్కోసారి కాన్సిల్ చేయాలంటే కాన్సిలేషన్ చార్జీలు ఎక్కువే. అంత చార్జీలు అవసరమా? ఈ టికెట్ను వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి ఎలానూ కేటాయిస్తారు. మరి ఎందుకు రద్దు చార్జీలు వసూలు చేయాలి. ఒక వేళ ఎవరికీ కేటాయించక పోతే అప్పుడు చార్జీలు వసూలు చేయొచ్చు. అసలు రిజర్వేషన్ ఎందుకు? ఒక ఐదు రోజుల ముందు టికెట్స్ విడుదల చేస్తే పోలా? మరీ రెండు నెలల ముందు అవసరం లేదు.

అన్నీ అవసరాలు అరవై రోజుల ముందు రావు కదా. కొంత మంది అనొచ్చు. తత్కాల్ ఉందిగా అని? సామాన్యునికి అందుబాటు రేట్లలో ఇవి ఉన్నాయా? ఒక రోజు ముందు వారికున్న అన్నీ పనులు అపేసి సరిగ్గా 10 లేదా 11 గంటలకు నెట్ సెంటర్ దగ్గర ఉండగలరా? అసలు తత్కాల్ ఎందుకు ? ఒక బండిలో ఎక్కువ సంఖ్యలో ఎయిర్ కండిషన్ (ఎసి) బోగీలు ఉంటున్నాయి. సెకండ్ క్లాస్ సీట్లు తగ్గుతున్నా యి. పోనీ అక్కడైనా సౌకర్యంగా ఉంటుందా? జనరల్ టికెట్ తీసుకొని రిజర్వ్‌డ్ బోగీలు ఎక్కేస్తున్నారు. మరి వీళ్ళని టికెట్ కలెక్టర్ చూడడం లేదా? చూసి ఊరు కుంటున్నారా! లేదా ఇంకేమైనాతెలియని లాజిక్‌ఉందా? ఇవన్నీ బహిరంగ రహస్యాలే. బోగీల్లో ఆహార పదార్థాలు రేటు ఎక్కువ, నాణ్యత మాత్రం తక్కువ. ఎసి బోగీల్లో రగ్గులు, బ్లాంకెట్లు అడిగితే తప్ప ఇవ్వడం లేదు. ఇచ్చినా సరే వాటి వాసన బాగుండడం లేదు. ఆడుగుదాం అంటే అటెండెంట్ భాష ప్రయాణికులకు రాదు. మన భాష వారికి తెలియదు. ప్రాంతీయ భాషలు వచ్చిన వారు దొరకరా? బోగీల్లోమూత్రశాలలు పరిశుభ్రంగా ఉండవు. ఒక్కోసారి నీరు రాదు. ఎవరికి చెప్పాలి ? 139 నంబర్కి ఫోన్ చేద్దామంటే లైన్ కలవదు. కలిసినా రకరకాల ఆప్షన్స్ అడుగుతుంది. అదీ దాటీ వెళ్తే చివరికి మనకు తెలియని భాషలో అవతలి వారు మాట్లా డుతారు. అందరికీ హిందీ, ఇంగ్లీష్ రాదు కదా ! ఆన్‌లైన్లో 'రైల్ మదాద్' ద్వారా ఫిర్యాదు చేయాలని ఎంతమందికి తెలుసు ?

రద్దీ సమయాలలో స్పెషల్స్ వేస్తున్నారు. మంచిదే! కానీ సరైన ప్రచారం లేక, ఆ విషయం చాలా మందికి తెలియక ఖాళీగా వెళ్లిపోతున్నాయి. అంతే కాదు స్పెషల్ బండిలో టికెట్ ధర సాధారణ బండి కంటే కొంచెం ఎక్కువే మరి.అవునులే. ఆమాత్రం ఉండకపోతే ఎలా?స్పెషల్ కదా!. పెద్ద పెద్ద రైల్వే స్టేషన్లలో ఒకే దగ్గర అన్ని ప్లాట్‌ఫామ్స్ లేకుండా, వేర్వేరు దిక్కులకు వెళ్ళే ట్రైన్స్ అన్నింటికీ వేర్వేరు ప్లాట్‌ఫామ్స్ నిర్మించాలి. శాఖాపరమైన సలహాలు తీసుకొని ముందుకు పోవాలి.



**- జనక మోహన రావు దుంగ**
8247045230

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ,అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోలు పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతిపాదించిన 240 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 119 ఐకెపి, 21 పాక్స్,7 మెప్మా,1డి.సి.ఎం.ఎస్. మొత్తం 148 కేంద్రాలను ఓపెన్ చేశామని, మరో రెండు రోజుల వ్యవధిలో మిగిలిన 92 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకుని వచ్చే ధాన్యం తేమ శాతం,ఇతర ప్రమాణాలను చెక్ చేసి ఎఫ్.ఏ.క్యు ఉన్న ధాన్యం మద్దతు ధర పై కొనుగోలు చేసీ ఓ.పి.ఎం.ఎస్.లో ఎంట్రీ చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రక్ షీట్స్ ప్రకారం సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. జిల్లాలో ఉన్న ఖాళీ గోదాము లను సమీపంలో గల కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి మండలం సమీపంలో గల గోదాములను ధాన్యం భద్ర పరిచేందుకు హైర్ పద్దతిలో తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డిఏఓ అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద నివారణపై అవగాహన



**హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్):** సిరిసిల్ల పట్టణంలోని పలు పాఠశాలలలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎస్ఎఫ్ఓ నరేందర్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అగ్ని ప్రమాద నివారణ పై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రేడియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, భారతి విద్యా నిలయం, శ్రీ చైతన్య పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను పంచారు. అనంతరం అగ్ని ప్రమాద నివారణ, నియంత్రణ పై ఎలాంటి చర్యలు తీసుకోవాలో క్లుప్తంగా వివరించారు.

## బిఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



**హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్):** శంకరపట్నం మండలం వంకాయ గూడెం గ్రామంలోని మాధవ సాయి గార్డెన్ లో మంగళవారం బిఆర్ఎస్ భారీ బహిరంగ సభ పోస్టర్ ను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవిష్కరించారు. ఎల్కతుర్తి లో నిర్వహించే బిఆర్ఎస్ భారీ బహిరంగ సభకు శంకరపట్నం మండలం నుండి 2000 మంది తరలిరావాలని సూచించారు, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని ఇరవై నెలలో ఆ పార్టీకి తీవ్ర వ్యతిరేకం వచ్చిందని వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి అధికారులకు వస్తామని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జెడ్పిటిసిలు లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి పొద్దుటూరి సంజీవరెడ్డి, సర్పంచ్ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పల్లె సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి.బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు




- మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రపాణి

**మంచిర్యాల, ఏప్రిల్ 15( మనం న్యూస్):** యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రపాణి సూచించారు. మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తుపదార్థాలను నిరోధించడానికి, విద్యార్థులలో అవగాహన పెంపొందించడానికి కళాశాల మత్తుపదార్థాల నిరోధక కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయన పాల్గొన్నారు . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లడారు .మత్తుపదార్థాల పై అవగాహన కలిగించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఏప్రిల్,16 న అనగా నేడు నిర్వహించే వివిధ అవగాహన కార్యక్రమాల లో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రిన్సిపాల్ కోరారు. ఈ సందర్భంగా కళాశాల మత్తుపదార్థాల నిరోధక కమిటీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను ప్రిన్సిపాల్ అభినందించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



**హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డు ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేనందున అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రదేశాల్లో రబ్బర్ స్ట్రిప్స్ , స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయుటకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సంబధిత అధికారులకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్లపై వ్యూ అంతరాయం కలగకుండా పిచ్చి మొక్కలు పూర్తిస్థాయిలో తొలగించాలని, పెద్దగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ రావాలని, దాని కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అంతర్గత ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్డు మరమ్మత్తు ప్రాంతాల్లో శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట డివైడర్లు స్పీడ్ బ్రేకర్లు,స్పీడ్ కంట్రోల్ సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే తంగళ్ళపల్లి, తిప్పాపూర్ గీ రోడ్, గంభీరావుపేట్, కోనరావుపేట ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి, కోదురుపాక జంక్షన్ వంటి 13 ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ లకు గుర్తించి అక్కడ రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ అండ్ బీ. ఈ.ఈ. వెంకట రమణయ్య , జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ , మున్సిపల్ కమిషనర్లు, సమ్మయ్య, పి.అర్.ఈఈ సుదర్శన్ రెడ్డి , జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు,ఆర్.టి.సి. అధికారులు, నేషనల్ హైవేస్, రీజినల్ ట్రాన్స్పోర్ట్ కమిటీ మెంబర్ సంగీతం శ్రీనాథ్, అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్ బ్రిడ్జిని పట్టుకొచ్చింది మేమే ప్రారంభించింది మేమే

- క్యాతనపల్లి ప్రజల దశాబ్ద కల నెరవేరింది
- క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభించిన ఎమ్మెల్యే



**రామకృష్ణాపూర్,ఏప్రిల్ 15 (మనం న్యూస్):** గత కొన్ని సంవత్సరాల క్రితం క్యాతనపల్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లైఓవర్ సమస్యపై స్పందించి ప్రజల అవసరాల నిమిత్తం ఫ్లైఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయించింది మేమేనని నేడు దానిని పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసి ప్రారంభించింది మేమేనని చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.మంగళవారం క్యాతనపల్లి ఫ్లైఓవర్ ను పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి సాకారం అయిందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా పాలన కొనసాగిస్తుందని ఆయన తెలిపారు అందులో భాగంగానే క్యాతనపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని తెలిపారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జాప్యం జరిగాయని ఆయన పేర్కొన్నారు.దాదాపు పది సంవత్సరాల క్రితం నేను పెద్దపల్లి ఎంపీ గా ఉన్న సమయంలో బ్రిడ్జి మంజూరు కాగా గత పాలకుల జాప్యంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు మళ్ళీ వివేక్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రత్యేక చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన తెలిపారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ రోడ్ల నిర్మాణాలకు పెద్ద పీట వేసిందని అందులో భాగంగానే క్యాతన్పల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని ఆయన తెలిపారు. క్యాతనపల్లి ప్రజలకు మంచిర్యాలకు వెళ్లేందుకు ఇబ్బందుల నుండి ఉపశమనం కలిగిందని నేటి నుండి క్యాతనపల్లి రహదారి వ్యవస్థ మెరుగుపడిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధిశ్రీనివాస్, మాజీ చైర్మన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్ రెడ్డి, నాయకులు గాండ్లసమ్మయ్య, అబ్దుల్ అజీజ్, యాకూబ్ అలీ, నీలం శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



**మల్యాల, ఏప్రిల్ 15, ( మనం న్యూస్):** మల్యాల మండలంలోని ఆయా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బిజెపి మండలశాఖ అధ్యక్షులు గాజుల మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరికోతలు ప్రారంభమైయి సుమారు ఇరవై రోజులు గడిచాయని, రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో యధావిధిగా కుప్పలు తెప్పలుగా పోశారని, ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిచక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, మండలంలో ఇప్పటికే సగానికి పైగా వరి కోతలు పూర్తి అయ్యాయని, కానీ... ఇంతవరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతుల అవసరాలను దళారులు, మిల్లర్లు ఆసరాగా చేసుకొని రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని క్వింటల్ కి 1800 నుంచి 2000 లోపు తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను నిండా ముంచుతున్నారని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు పాక్షికంగా దెబ్బ తిన్నాయని, మళ్లీ అకాల వర్షాలు సంభవిస్తే ఆరబోసిన ధాన్యం కూడా తడిసే ప్రమాదముందని, దానివల్ల రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు.

## నిత్యవసర వస్తువుల పంపిణీ



- పేదలకు సాయం చేయడం సంతోషకరమైన విషయం
- కోట రవీందర్ రెడ్డి

**రామగిరి ఏప్రిల్ 15 మనం న్యూస్:** ఐన్టియుసి అర్జీ-3 ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్వచర్ల గ్రామంలో నివాసం ఉంటున్న మూడు నిరుపేద కుటుంబాలకు ఒక నెలకు సరిపడ నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. అనంతరం మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మేము నిర్వహిస్తున్న కార్యక్రమాలు పత్రికల, సామాజిక మాధ్యమాల చూసి పేదవారి సహాయం చేయాలనే సంకల్పంతో మంగళవారం కోట రవీందర్ రెడ్డి స్పందించడం అభినందనీయమని తెలిపారు.అంతరం కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,సింగరేణి యువబలగం ప్రతినిధి మేకల మారుతి యాదవ్ ఆధ్వర్యంలో నిజమైన పేదలను గురించి సహాయం చేయడం మమ్ములను చలిచివేసింది అందులో భాగంగా నేను నా పుట్టిన రోజు సందర్భంగా నా వంతుగా సహాయం చేస్తానని గంట వెంకటరమణ రెడ్డి కి తెలపడం జరిగిందన్నారు.ఇతరులు కూడా మీ శుభకార్యాలలో పెద వారికి సహాయం చేసే విధంగా ఆలోచించాలి అని తెలిపారు. కార్యక్రమంలో మేకల మారుతి యాదవ్, ఐఎన్టియుసి సెంట్రల్ నాయకులు బెల్లం శ్రీనివాస్,బత్తుల రమేష్, పన్నూరు మాజీ ఎంపీటీసీ కొప్పుల గణపతి, వేముల తిరుపతి,అనవేన శ్రీనివాస్, శంకర్ ముదిరాజ్ ,కోట నికిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 ( మనం న్యూస్):** మండల కేంద్రంలో మంగళవారం ప్యాక్స్ వారి ఆధ్వర్యంలో. నిర్వహిస్తున్న వరిధాన్య కొనుగోలు కేంద్రాన్ని. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి అమ్ముకోవాలన్నారు. దళారీలకు విక్రయించి మోసాలకు గురికావద్దని ఆయన తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కార్యాచరణ అమలు

- నిర్దేశించినలోపు గ్రామాలకు, వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల అలాట్మెంట్ పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల పథకంపై అధికారులతో జిల్లా కలెక్టర్




**హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఇందిరమ్మ ఇండ్ల పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు ఉండటానికి వీలు లేదని, మనకు వచ్చిన దరఖాస్తులలో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేయాలని, మన జిల్లాలో రెండు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 7000 ఇండ్లు మొదటి విడతలో నిర్మిస్తున్నామని కలెక్టర్ సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు పై పలు సూచనలు చేశారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలు ఎంపిక చేసిన గ్రామాలలో కొన్ని ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇండ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అర్హత ఉండి ఇంటి స్థలం ఉన్న దరఖాస్తుల సంఖ్య ప్రాతిపదికగా సదరు గ్రామాలకు, వార్డులకు ఇండ్ల కేటాయింపు ఏప్రిల్ 17 లోగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గ్రామాలు, వార్డులలో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి, అర్హుల జాబితాలో నుంచి మొదటి విడత మంజూరు చేసేందుకు గ్రామానికి అలాట్మెంట్ చేసిన ఇండ్ల సంఖ్యకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు.ఏప్రిల్ 21 లోపు ఇందిరమ్మ కమిటీల నుంచి ప్రతి గ్రామానికి/ వార్డుకు అలాట్ చేసిన ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల జాబితా వివరాలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీల నుంచి సమాచారం రాకపోతే సంబంధిత ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓ లకు సూచించారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్ల లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి బృందంగా ఏర్పడి ఏప్రిల్ 22 నుంచి ఏప్రిల్ 30 వరకు మరోసారి ఫీల్ వెరిఫికేషన్ చేయాలని,ఎవరైనా అనర్హులు ఉంటే జాబితా నుంచి తొలగించాలని అన్నారు.మే 2,2025 న ప్రతి గ్రామంలో అర్హుల జాబితా అతికిస్తామని, జిల్లా ఇంఛార్జి మంత్రి వర్యుల తుది ఆమోదంతో మే 5 తరువాత ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాలు పంపిణీ మండల కేంద్రాలకు అందించడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ కమిటీ లో నుంచి జాబితా తెచ్చుకునే అంశంలో అధికారులు, ఆర్డిఓ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు నాలుగు దశలలో సహాయం అందుతుందని, బేస్మెంట్ పూర్తయితే 1లక్ష రూపాయలు, లెంటల్ లెవెల్ పూర్తయితే 1లక్ష , స్లాబ్ నిర్మాణం జరిగినప్పుడు 2 లక్షలు, ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత 1 లక్ష చొప్పున మొత్తం 5 లక్షల రూపాయల ప్రభుత్వం నుంచి విడుదల చేయడం జరుగుతుందని అన్నారు మన జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలలో 1023 ఇండ్లు మంజూరు చేశామని, వీటిలో 282 ఇండ్లు మాత్రమే ఇప్పటివరకు మార్క్ చేయడం జరిగిందని, పెండింగ్ లబ్ధిదారులతో చర్చించి ఇండ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించేలా చూడాలని, ముందస్తుగా నిధులు ఇబ్బందులు ఉన్నవారికి స్వశక్తి మహిళా సంఘాల ద్వారా రుణం అందించి పనులు ప్రారంభించాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధా భాయి, పిడి. హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి , జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల ఏప్రిల్15 (మనం న్యూస్):** కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామం లో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మంగళవారం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతో పాటు కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడుపన్నాల అంజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమళ్ళ సత్యనారాయణ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆసి రెడ్డి రాజేశం రంజిత్ రెడ్డి కాశిరెడ్డి జనార్ధ న్ వి డి సి సభ్యులు ఆయా కుల సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి



**జైపూర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి ని కోరారు.జైపూర్ మండలంలోని సింగరేణి విద్యుత్ థర్మల్ పవర్ ప్లాంట్ ముందు మంగళవారం కాంట్రాక్టు కార్మికులతో హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేసిన విధంగా మండలంలోని పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని ఉప ముఖ్యమంత్రిని కోరారు.పవర్ ప్లాంట్ కు ఆనుకొని ఉన్న పెగడపల్లి గ్రామం లో ప్లాంట్ నుండి వెలువడే దుమ్ముతో కలుషిత వాతావరణం చెంది భవిష్యత్తులో ప్రజలు క్యాన్సర్ తో పాటు అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉందని నివేదికలు బయట పడ్డాయని తెలిపారు.దీన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనించి పెగడపల్లి గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ పరిధిలోనికి తీసుకువచ్చి అన్ని సదుపాయాలు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ యూనియన్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, ఎస్ టి పి పి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు విక్రమ్,సాయి, కృష్ణారెడ్డి,సంపత్ కుమార్,రిక్కుల నరసింహారెడి, శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి,సహాయ కార్యదర్శి నోముల బాలయ్య,కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# తిరిగి సొంత గూటికి చేరిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు

- చరిత్ర కలిగిన నాయకుడు మన కేసీఆరే
- మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**వేల్పూర్, ఏప్రిల్16(మనం న్యూస్):** దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత మాజీ సీ.ఎం.కే.సీ.ఆర్ దేన నీ మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి. అన్నారు..నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన వేల్పూర్ గ్రామంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్వగృహంలో ఆయన సమక్షంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన మాజీ తాజా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పలువురు తిరిగి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బి బి ఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలు చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు. బాల్కొండ ఎమ్మెల్యే సమక్షంలో బి ఆర్ ఎస్ పార్టీలో చేరిన బాల్కొండ నియోజకవర్గం లోని మెండోరా మండలం సొన్ పేట్ గ్రామ మాజీ సర్పంచ్ గోలి ప్రకాష్ ,దూదిగం మాజీ సర్పంచ్ పసుల శ్రీనివాస్ వారి అనుచరులు, నాయకులు, కార్యకర్తలు తిరిగి సొంతగూటికి చేరడం శుభ సూచకం అన్నారు.రాదు అనుకున్న తెలంగాణ ను సుదీర్ఘ పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు.

14 ఏండ్ల ఉద్యమంలో ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని, సబ్బండ వర్గాల ప్రజలను ఒక్కతాటిపై తీసుకు వచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ అని ఆయన కొనియాడారు. బాల్కొండ నియోజకవర్గంలో మోతె, బుస్సాపూర్ లాంటి అనేక గ్రామాలు ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ ఉద్యమనికి అండగా నిలబడ్డాయి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మా తండ్రి స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ వెంట ఉద్యమ ప్రస్థానంలో మొదటి నుండి ముందుకు సాగారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వచ్చిన తెలంగాణ ను గత 10 ఏండ్లలో అనేక రంగాలలో మాజీ సీఎం, కేసీఆర్ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామి గా నిలిపారు అని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో మనం అధికారం కోల్పోవడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ సీ.ఎం. రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చి,ప్రజలను నమ్మించి మోసం చేసి గద్దెనెక్కాడు ఆయన అన్నారు.

ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పై పూర్తిగా భ్రమలు తొలిగి పోయాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజలు, నాయకులు ,కార్యకర్తలు మళ్ళీ టిఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారు.అందుకే పార్టీలో చేరుతున్నారు అని అన్నారు పాత వారికి కొత్త వారు అనే భేదాలు లేకుండా పార్టీలో చేరుతున్న వారు గ్రామాలలో ఒకరికొకరు సమన్వయం చేసుకొని పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలి అని తెలిపారు.

అందరం కలిసికట్టుగా పనిచేసి మోసపూరిత కాంగ్రెస్ ను గద్దె దించి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తిరిగి మళ్ళీ మనం అందరం భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్,మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి,మాజీ ఎం.పి.పి. కమలాకర్, మాజీ ఎంపిటిసి దేవేందర్,బాబా,మాజీ సర్పంచ్ లు నాగుల నర్సయ్య ,గంగారెడ్డి,రాజారెడ్డి, గంగారెడ్డి మరియు యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళాకు మంచి స్పందన



**కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనంప్రతినిధి ) :** కామారెడ్డి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన న్యూ లాండ్ లాబరేటరీ మెగా జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చిందని కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేఖ్ సలాం పేర్కొన్నారు. నిరుద్యోగుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న జాబ్ మేళాలు నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని నోడల్ అధికారి తెలిపారు. అదేవిధంగా ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 17వ తేదీన, బిచ్కుంద ప్రభుత్వం జూనియర్ కళాశాలలో 18వ తేదీన జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి షేఖ్ సలాం, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మొహమ్మద్ ఎజాజ్, శ్రీధర్, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ హకీమ్, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శివ, అధ్యాపకులు స్వరూప్, సమీ, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రజాక్, లైబ్రరియన్ కార్తీక్, న్యూ ల్యాండ్ ల్యాబరేటరీ సంస్థ ప్రతినిధులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# కామారెడ్డి బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ):** కామారెడ్డి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం బార్ అసోసియేషన్ భవనంలో ఎన్నికల అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడుగా నంద రమేష్, ఉపాధ్యక్షుడిగా చికోటీ మురళి, ప్రధాన కార్యదర్శిగా బండారి సురేందర్ రెడ్డి, ఉప కార్యదర్శి గా మోహన్ రెడ్డి, కోశాధికారిగా వేణుప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఎం. డి.సలీం, అంగ్రేజీ, విఠల్ రావు, యాదగిరి, ఆన్సర్ అలీ లు ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన నంద రమేష్ మాట్లాడుతూ., న్యాయవాదుల సమస్యలపై ఎల్లప్పుడూ ముందు ఉండి న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో




కామారెడ్డి జిల్లా జడ్జి వరప్రసాద్, జిల్లా అదనపు జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి సుమలత, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ మరియు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బట్టు దీక్ష పాల్గొన్నారు.

# గంగమ్మ మాత దేవికి ప్రత్యేక పూజలు

**కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 16(మనం న్యూస్):** బాల్కొండ నియోజకవర్గం లోని కమ్మర్పల్లి మండలంలో గల బషీరాబాద్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గంగమ్మ జాతర వేడుకలలో కమ్మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట్ రవి, కమ్మర్పల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు గ్రామస్తుల కోరిక మేరకు విచ్చేసి గ్రామస్తుల, దీక్షపరుల తో ప్రత్యేక పూజలు జరిపారు. గంగమ్మ మాత తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించి, వేద పండితుల ప్రత్యేక పూజలు జరిపి, తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



## జాతీయం- అంతర్జాతీయం

# ఈడీని రద్దు చేయాలి: అఖిలేశ్ యాదవ్

**భువనేశ్వర్, ఏప్రిల్ 16:** ఆర్థిక సంబంధిత నేరాలను దర్యాప్తు చేసేందుకు ఇతర ఏజెన్సీలు ఉన్న నేపథ్యంలో ఈడీని రద్దు చేయాలని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏర్పాటు అయ్యిందని, ఇప్పుడు అదే సంస్థ నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్



పేర్కొన్నారు. ఆర్థిక సంబంధిత నేరాలను దర్యాప్తు చేసేందుకు ఇతర ఏజెన్సీలు ఉన్న నేపథ్యంలో ఈడీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒడిశాలో పర్యటనలో ఉన్న అఖిలేశ్.. నేషనల్ హెరాల్ కేసులో సోనియా, రాహుల్‌పై ఈడీ ఛార్జిషీటు దాఖలును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసనలు చేస్తుండడంపై ఇలా స్పందించారు. ''నేషనల్ హెరాల్డ్ కంటే ఈడీ గురించి మాట్లాడుతా. ఈడీని ఏర్పాటు చేసింది కాంగ్రెస్. కానీ, అదే సంస్థతో ఇప్పుడు ఆ పార్టీ ఇబ్బందులు పడుతోంది. ఆర్థిక నేరాలపై దర్యాప్తు చేసేందుకు ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంట్ వంటి అనేక సంస్థలు ఉన్నాయి. అందుకే ఈడీ అవసరం లేదు. దాన్ని రద్దు చేయాలి'' అని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలో డబుల్ ఇంజిన్ మోడల్ ఏమేరకు విజయం సాధించిందని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. యూపీలో రెండు ఇంజిన్లు వేర్వేరు లైన్లలో వెళ్తున్నాయని విమర్శించారు. ఒడిశాలో ఏం జరుగుతోందనే విషయం తనకు తెలియదన్న ఆయన.. కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలు చూపడం లేదన్నారు.

# తదుపరి సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

**ఢిల్లీ, ఏప్రిల్ 16:** తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్‌ను ప్రస్తుత సీజేఐ సిఫార్సు చేశారు. తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈమేరకు ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కేంద్ర న్యాయశాఖకు సిఫార్సు చేశారు. జస్టిస్ ఖన్నా పదవీకాలం మే 13న ముగియనుంది. మరుసటి రోజు నూతన సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబర్ 24న భూషణ్ రామకృష్ణ గవాయ్



జన్మించారు. జస్టిస్ గవాయ్ 1987 నుంచి 1990 వరకు బాంబే హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత నాగపూర్ బెంచ్‌లోనే ప్రధానంగా తన ప్రాక్టీస్ కొనసాగించారు. 1992 నుంచి 1993 వరకు అక్కడే అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. అనంతరం నవంబర్ 12, 2005లో బాంబే హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మే 24, 2019న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ గవాయ్.. ఈ ఏడాది నవంబర్ 23 వరకు సీజేఐగా సేవలందించనున్నారు.

# ఇరాన్ను చుట్టుముడుతున్న అమెరికా..: మరో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ తరలింపు

**టహరాన్, ఏప్రిల్ 16:** ఓవైపు ఇరాన్‌తో అణుచర్చలు మొదలుపెట్టిన అమెరికా మరోవైపు మెల్లగా టెహరాన్‌పై ఒత్తిడి పెంచే వ్యూహం అనుసరిస్తోంది. ఈక్రమంలో తన అత్యాధునిక ఆయుధాలను ఆ దేశం చుట్టూ మోహరిస్తోంది. వాస్తవానికి ఈ చర్చలు మొదలుకావడానికి ముందే అమెరికా తన రెండో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ కార్ల్ విన్సన్‌ను ఈ ప్రాంతం వైపు నడిపించడం మొదలుపెట్టింది. దీంతోపాటు క్యారియర్ స్ట్రైక్ గ్రూపులోని పటాలం మొత్తం అరేబియా సముద్రం దిశగా ప్రయాణం మొదలుపెట్టాయి. ఇక అప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ హారీ ఎస్ ట్రూమన్ కూడా



ఇలాంటి దాడులు హూతీలపై చేపడుతున్న విషయం తెలిసిందే. మరోవైపు అణుచర్చలు విఫలమైతే ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై కచ్చితత్వంతో దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా హెచ్చరిస్తున్నారు. దీనికి ఇరాన్ కూడా దీటుగా స్పందిస్తూ.. ప్రస్తుతం ఉన్న యూరేనియం నిల్వలతో తాము తేలిగ్గా అణుబాంబును తయారు చేయగలమని చెబుతోంది. ఇరాన్-అమెరికాల మధ్య తొలివిడత చర్చలు ఒమన్‌లో జరిగాయి. అమెరికా ప్రతినిధిగా స్టీవ్ విట్‌కాఫ్ పాల్గొన్నారు. ఈ చర్చలు నిర్మాణాత్మకంగా జరిగి ఫలవంతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ కూడా చర్చలు సాఫీగా జరుగుతున్నట్లు ధ్రువీకరించడం విశేషం. ఈ పరిణామాలపై సంప్రదింపులు, సలహాల కోసం ఇరాన్ బృందం ఒకటి ఇప్పటికే రష్యాకు కూడా వెళ్లింది. ఇక ఇరుదేశాల తొలి సమావేశం తర్వాత ట్రంప్ స్పందిస్తూ ర్యాడికలైజేషన్ అయిన దేశాల వద్ద అణుబాంబులు ఉండకుండా చేయడమే దీని ఉద్దేశమన్నారు. ఇక ఇరాన్‌పై సైనిక చర్య ఆప్షన్‌ను ఆయన కొట్టిపారేయలేదు.

**ఇరాన్ చుట్టూ బాంబర్లు.. స్టెల్త్ ఫైటర్లు..!**

ఇక అమెరికా రెండో విమాన వాహక నౌక కార్ల్ విన్సన్ ఒమన్‌లోని సొకొత్రా ద్వీపం సమీపం నుంచి పనిచేయనుంది. ఈ నౌకతోపాటు.. ఈ గ్రూపులో యూఎస్ఎస్ ప్రిన్స్‌టన్, యూఎస్ఎస్ స్టెరెట్, యూఎస్ఎస్ విలియమ్ పి లారెన్స్ ఉన్నాయి. కార్ల్ విన్సన్ నౌకపై ఎఫ్-35, ఎఫ్18 విమానాలు ఉన్నాయి. వీటికితోడు అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ కూడా దాడులకు సన్నాహాలు చేస్తోంది. దీని స్థావరం బహ్రెయిన్‌లోని మనమాలో ఉంది. ఇది ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ పర్షియాలో కార్యకలాపాలకు బాధ్యత వహిస్తుంది. అమెరికా కీలక స్థావరమైన డియాగో గార్సియాలో అమెరికా బీ-2 స్టెల్త్ బాంబర్లను మోహరించింది. ప్రపంచంలోనే వీటిని తలదన్నే బాంబర్లు లేవనే చెప్పాలి. ఇది ఇరాన్‌లో అండర్‌గ్రౌండ్ స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకోగలదు. అమెరికా వద్ద ఇలాంటివి మొత్తం 20 ఉంటే.. వీటిల్లో ఆరింటిని ఇరాన్ సమీపంలోకి తరలించాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

# భాషకు మతం లేదు.. పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ, ఏప్రిల్ 16:** నేమ్ బోర్డుల్లో ఉర్దూను ఉపయోగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భాష అనేది మతం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. నేమ్ బోర్డుల్లో ఉర్దూను ఉపయోగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోని నేమ్ బోర్డులపై మరాఠీతో పాటు ఉర్దూను ఉపయోగించడాన్ని సవాలు చేస్తూ మహారాష్ట్రలోని అకోలా జిల్లా పాటూరు మాజీ కౌన్సిలర్ వర్షతాయ్ సంజయ్ బగాడే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. మున్సిపల్ కౌన్సిల్లో జరిగే పనులన్నీ మరాఠీలోనే నిర్వహించాలని.. ఉర్దూను సైన్ బోర్డులపై ఉపయోగించడానికి అనుమతించకూడదని తన పిటిషన్లో పేర్కొన్నారు. అంతకుముందు ఆమె అభ్యర్థనను మున్సిపల్ కౌన్సిల్ తిరస్కరించింది. ఆ తర్వాత బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా.. అక్కడా అనుకూలంగా ఫలితం రాలేదు. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



దీనిపై జస్టిస్ సుధాంశ్ ధులియా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''భాష ఒక సమాజానికి, ఒక ప్రాంతానికి, ప్రజలకు చెందినది. ఒక మతానికి సంబంధించినది కాదు. భాష అనేది ఒక సంస్కృతి. సమాజం, ప్రజల నాగరికత పురోగతిని కొలవడానికి ఇది ఒక కొలమానం. ఉర్దూ విషయంలో కూడా అంతే'' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

స్థానికులు చాలా మంది ఆ భాషను అర్థం చేసుకున్నందున ఉర్దూను నేమ్‌బోర్డుల్లో మున్సిపల్ కౌన్సిల్ అలానే ఉంచిందని కోర్టు వ్యాఖ్యానించింది. మున్సిపల్ కౌన్సిల్ చేయాల్సిందల్లా సమర్థవంతమైన కమ్యూనికేషన్‌ను రూపొందించడమే అని పేర్కొంది. 2022 చట్టం లేదా ఇతర ఏ చట్టంలోని నిబంధనల్లోనూ ఉర్దూ వాడకంపై నిషేధం లేదని హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తాము ఏకీభవిస్తున్నామని చెప్పి అత్యున్నత న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది.

# అమిత్ షాను ప్రధాని మోదీ నియంత్రించాలి: మమత

**కోల్‌కతా, ఏప్రిల్ 16:** వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా బెంగాల్లో చెలరేగిన హింసలో హోంమంత్రి అమిత్ షా హస్తం ఉందని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) చట్టం-2025కి వ్యతిరేకంగా బెంగాల్లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారడంలో అమిత్ షా హస్తం ఉందని ఆరోపించారు. ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అని.. ఇందుకోసం అమిత్ షా, బీఎస్ఎఫ్ కలిసి కుట్రపూరితంగా బంగ్లాదేశీయులను రాష్ట్రంలోనికి వదిలారని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. సొంత రాజకీయ అజెండాను నెరవేర్చుకోవడానికి దేశానికి హాని చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ.. అమిత్ షాను నియంత్రించాలని అన్నారు.



ముర్షిదాబాద్ అల్లర్ల వెనుక సరిహద్దు అవతల నుంచి వచ్చిన వ్యక్తుల పాత్ర ఉందని నిఘా వర్గాలు తమకు తెలిపాయని మమత పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లోని ఘర్షణలకు సంబంధించిన దృశ్యాలను బెంగాల్లో జరుగుతున్నట్లు చెబుతూ సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మమతాబెనర్జీ ఆరోపించారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తమ పార్టీ ముందంజలో ఉందని అన్నారు. ఈ విషయంపై ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దని ప్రధానిని కోరారు. హింసాకాండలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షల నష్ట పరిహారం ఇస్తామని మమత ఈ సందర్భంగా ప్రకటించారు. ఘర్షణల్లో బీఎస్ఎఫ్ పాత్రపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

# తొలి త్రైమాసికంలో చైనా ఆర్థిక వృద్ధి 5.4 శాతం

**బీజింగ్, ఏప్రిల్ 16:** అమెరికా సుంకాల వేళ తొలి త్రైమాసికంలో 5.4 శాతం ఆర్థిక వృద్ధి నమోదు చేసినట్లు చైనా వెల్లడించింది.అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమవుతోంది. ఇరుపక్షాలు టారిఫ్లతో విరుచుకుపడుతున్నాయి. అయితే.. అమెరికా కొత్త సుంకాల వేళ తమ ఆర్థికవృద్ధి మెరుగ్గానే



ఉందని చైనా ప్రకటించింది. మొదటి త్రైమాసికంలో తమ ఆర్థిక వ్యవస్థ అంచనా వేసిన 5.4 శాతం వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించింది. అగ్రరాజ్యం కొత్త సుంకాలను విధించకముందే ఎగుమతిదారులు వస్తు సరఫరాలను పెంచడంతో ఇది సాధ్యమైందని పేర్కొంది. ''ప్రాథమిక అంచనాల ప్రకారం.. మొదటి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి స్థిర ధరల వద్ద 5.4 శాతం పెరిగింది'' అని బీజింగ్ నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ వెల్లడించింది. అంతకుముందు ఏఎఫ్పీ అంచనా వేసిన 5.1 శాతం కంటే ఇది ఎక్కువకావడం గమనార్హం. పారిశ్రామిక ఉత్పత్తి కూడా తొలి త్రైమాసికంలో 6.5 శాతం పెరిగింది. ఇది 2024 చివరి మూడు నెలల్లో 5.7 శాతంగా ఉంది. ఇక కీలకమైన రిటైల్ అమ్మకాలు గత ఏడాదితో పోల్చితే 4.5 శాతం పెరిగినట్లు ఎన్‌బిఎస్ వెల్లడించింది. అయితే.. ప్రపంచ ఆర్థిక వాతావరణం మరింత సంక్లిష్టంగా, తీవ్రంగా మారుతోందని.. వృద్ధిని పెంచడం అవసరమని బీజింగ్ పేర్కొంది. అమెరికా-చైనాల మధ్య టారిఫ్ల యుద్ధం తీవ్రమవుతున్న విషయం తెలిసిందే. ట్రంప్ ఇటీవల పలు దేశాలపై పరస్పర సుంకాలు ప్రకటించారు. ఈ ప్రకటన అనంతరం యూఎస్‌తో వాణిజ్యఒప్పందం కుదుర్చుకునేందుకు కొన్ని దేశాలు సిద్ధమయ్యాయి. దీంతో ప్రతిఘటించని దేశాలకు టారిఫ్ల నుంచి 90 రోజుల విరామం కల్పించారు. అయితే, చైనా మాత్రం అందుకు విరుద్ధంగా అమెరికా వస్తువులపై సుంకాల శాతాన్ని పెంచుకుంటూ వచ్చింది. దీంతో చైనా వస్తువులపై ట్రంప్ 145 శాతం సుంకం విధించగా.. చైనా కూడా అగ్రరాజ్యం వస్తువులపై 125 శాతం సుంకాలు విధించింది. దీంతో ఇరుదేశాల మధ్య ట్రేడ్ వార్ మొదలైంది. మరోవైపు ఇరు దేశాలు భారీగా పరస్పర సుంకాలు ప్రకటించుకున్న నేపథ్యంలో తమ దేశంలోని అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్‌కు ఎగుమతి చేయడం కూడా చైనా నిలిపివేసింది. ఈక్రమంలో వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలకు రావాల్సింది చైనానే అని, తమకు ఆ అవసరం లేదని ఆమె పేర్కొన్నారు.

## తండ్రి పేరు చెప్పొద్దని.. 15 మిలియన్ డాలర్ల ఆఫర్‌ఎలాన్ మస్క్‌పై రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ ఆరోపణలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** తన బిడ్డకు తండ్రి ఎలాన్ మస్క్ అనే విషయాన్ని దాచిపెట్టేందుకు టెస్లా సీఈవో 15 మిలియన్ డాలర్లు ఆఫర్ చేశారని రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ ఆరోపించారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ సంచలన ఆరోపణలు చేశారు. తమ ఇద్దరికి పుట్టిన చిన్నారికి తండ్రిగా తన పేరును బయటపెట్టొద్దని మస్క్ తనను కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని



దాచిపెట్టేందుకు 15 మిలియన్ డాలర్లు ఆఫర్ చేసినట్లు వెల్లడించారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్లెయిర్ ఈ విషయాలు తెలిపారు. కొన్ని నెలల క్రితం తాను ఓ బిడ్డకు జన్మనిచ్చానని.. తన చిన్నారికి ఎలాన్ మస్క్ తండ్రి అంటూ ఇటీవల సెయింట్ క్లెయిర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. తమ బిడ్డ గోప్యత, భద్రతను దృష్టిలోఉంచుకొని ఇంతకుముందు తాను ఈ విషయాన్ని బహిర్గతం చేయలేదని వివరించారు. కొన్ని మీడియా సంస్థలు మాత్రం ఆ విషయాన్ని బయటపెట్టాలని ప్రయత్నించినందున తానే దీన్ని వెల్లడించినట్లు తెలిపారు. ''నా చిన్నారి తన వల్లే జన్మించిందనే విషయాన్ని బయటకు చెప్పేందుకు మస్క్ ఇష్టపడలేదు. ఈ విషయాన్ని నన్ను కూడా దాచిపెట్టాలని కోరారు. మస్క్‌తో అనుబంధాన్ని, బిడ్డ తండ్రి ఎవరనేది దాచిపెట్టేందుకు నాకు 15 మిలియన్ డాలర్లు ఆఫర్ చేశారు. అందుకు సంబంధించి పత్రాలపై సంతకాలు చేయమన్నారు. ఒకవేళ ఒప్పందాన్ని విస్మరిస్తే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సి వస్తుందని అందులో పేర్కొన్నారు. మా బిడ్డకు 21 ఏళ్లు నిండేంత వరకు నెలనెలా లక్ష డాలర్లు ఇస్తానన్నారు. కానీ, నేను ఆ పత్రాలపై సంతకం చేయలేదు. ఎందుకంటే, నా చిన్నారి అంత రహస్యంగా పెరగడం నాకు ఇష్టం లేదు'' అని పేర్కొన్నారు. అయితే.. తన బిడ్డ జన్మకు మస్క్ కారణమంటూ గతంలో ఆష్లీ సెయింట్ క్లెయిర్ వ్యాఖ్యానించడంతో అతడి అభిమానులు ఆమెపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నాడు దీనిపై స్పందించిన మస్క్.. ఆమెకు 2.5 మిలియన్ డాలర్లు ఇచ్చినట్లు తెలిపారు . కానీ, ఆ బిడ్డ తన వల్లే జన్మించిందా..? లేదా..? అనే విషయం తనకు తెలియదని అన్నారు. క్లెయిర్‌కు టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఇచ్చిన ఆఫర్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# జూపాడు బంగ్లాలో ప్రజా వినతుల స్వీకరణ




జూపాడుబంగ్లా, ఏప్రిల్ 16 (మనం న్యూస్): జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వచ్చిన సమస్యల వినతులను అందుకున్న నందికొట్కూరు నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య. ఈ సందర్భంగా ఆయన గ్రామాలలో ఉండేటువంటి రెవెన్యూ సిబ్బంది అంతా రైతులను ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్య ఎక్కడ ఉందో గుర్తించి పరిష్కార దిశగా పనిచేయాలని ఆయన తెలియజేశారు, అదేవిధంగా తాసిల్దారు కూడా రైతులను రెవెన్యూ ఆఫీసు చుట్టూ తిప్పుకోకుండా తాసిల్దార్ అయితే నేమి డిప్యూటీ తాసిల్దార్ అయితే నేమి వీఆర్వోలు అయితేనేమి అందరూ కలిసికట్టుగా పనిచేసి రైతులకు న్యాయం జరిగే విధంగా వారు సంతోషించే విధంగా పనులు చేసి రైతుల నుండి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలని ఆయన తెలియజేశారు, అదేవిధంగా గతంలో చేసినటువంటి పాలకులు చేసినటువంటి అరాచక పాలన వల్లే ఈ రాష్ట్రం నష్టపోయిందని ఇవాళ మళ్లీ ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని ఆయన తెలియజేశారు. అయితే కొంతమంది పనిగట్టుకొని అమ్మ ఒడి చేయడం లేదని చెప్పి ప్రచారం చేస్తున్నారు. ఎవరు ఏమి భయపడాల్సినఅవసరం లేదు మన నాయకుడు మన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, చెప్పిన విధంగా చెప్పినటువంటి తల్లికి వందనము ప్రతి ఒక్కరికి కూడా జూన్ నెలలో ఇచ్చేందుకు కృషి చేస్తామని, అదేవిధంగా రైతన్నలకు ఇవ్వాల్సినటు వంటి అన్నదాత సుఖీభవ 20,000 కూడా మే నెల చివరి కల్లా ఇచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని. ఆయన తెలియజేశారు. అదేవిధంగా రైతన్నలు ఏదైనా సమస్య ఉన్నదని రెవెన్యూ ఆఫీస్ దగ్గరికి వెళ్ళినప్పుడు రెవెన్యూ అధికారులు మిమ్మల్ని అన్న మీ పని మూడు రోజుల లోపల అయిపోతుందని వారు ఫోటో దిగుదామని. అన్న ఎడల రైతన్నలు ఫోటోలు దిగరాదని. నీ పని పూర్తి అయి మీరు సంతృప్తి చెందితేనె ఫోటో దిగాలని ఆయన రైతన్నలకు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి గ్రామ పంచాయతీలోనూ ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రజలకు ఏ విధమైన అవసరతలు ఉన్నాయో సత్వరమే అవి పరిష్కరించాలని మండల ప్రజా పరిషత్ అధికారులకు తెలియజేశారు. ఈ గ్రీవెన్స్ లో 26 వినుతులు రైతన్నల నుండి అందడం జరిగిందని, ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆయన తెలియజేశారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ...

జూపాడు బంగ్లా మండలం తుడిచెర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారుడు బోకూరి దావీదు కు 52,295/-రూపాయలు, పారుమంచాల గ్రామానికి చెందిన జాదవ్ లింగేశ్వరరావు కుటుంబానికి 1,16,390/-రూపాయల ముఖ్యమంత్రి సహాయని ది ద్వారా మంజూరు అయిన చెక్కులను తుడిచెర్ల టిడిపి నాయకుడు నల్లబోతుల రాముడు, గ్రామ సర్పంచ్ బాల మద్దిలేటి, ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిత్త జయ సూర్య లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మండల క్లస్టర్ గిరీశ్వర్ రెడ్డి, తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్, సర్పంచ్ బాల మద్దిలేటి, అగ్రికల్చర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ అధికారి నాగేంద్ర, టిడిపి నాయకులు తంగడంచ పిక్కల శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, మండల ప్రజా పరిషత్ అధికారులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారం



బేతంచెర్ల,ఏప్రిల్ 16(మనం న్యూస్): పట్టణంలోని సంజీవ నగర్ కాలనీలో వేసవి కాలం ప్రారంభం నుంచి సుమారు 150 కుటుంబాలకు అరకొరగా తాగునీరు వస్తున్నడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు సమస్యను కాలనీవాసులు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సొంత నిధులు వెచ్చించి గతంలో ఉన్న బోరుబావి నుంచి పైపులైను ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది ఈ సందర్భంగా కాలనీవాసులు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి వైఎస్ఆర్సిపి మండల సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి,రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్ వైయస్సార్సీపి జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మంత్రాలయం నీరే సరఫరా చేయండి



మంత్రాలయం, ఏప్రిల్ 16(మనంన్యూస్): మంత్రాలయం నుంచి వచ్చే తాగునీరే మా గ్రామానికి అందించాలని కల్లుదేవకుంట గ్రామ సర్పంచ్ రవీంద్ర రెడ్డి, గ్రామ పెద్దలు గ్రామస్తులు ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఈఈ పద్మజా, ఆర్డబ్ల్యూఎస్ ఎఈ వెంకటరమణను కోరారు. బుధవారం కల్లుదేవకుంట గ్రామ సర్పంచ్ అధ్వర్యంలో గ్రామం నుంచి మూడు బొలోరో లు నాలుగు ఆటోలో ఆదోని ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం దగ్గరకు వెళ్ళారు.

# వైభవంగా శ్రీ వాగీశ తీర్థుల ఆరాధన



మంత్రాలయం, ఏప్రిల్ 16(మనంన్యూస్): కర్నాటక రాష్ట్రం, నవబృందావన గడ్డపై వెలిసిన వాగీశ తీర్థుల ఆరాధన వేడుకలు వైభవంగా జరిగింది. బుధవారం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో, వాగీశతీర్థుల ఆరాధన వేడుకలను పురస్కరించుకుని, వాగీశ తీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభి షేకం, ఫల పుష్పాభి షేకం తదితర ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. భక్తులు స్వామి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు శ్రీ మూల రామ దేవతలకు వివిధ అభిషేకాలతో పూజలు చేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్ర తీర్థులు భక్తులకు ఫల మంత్రాక్షితలు ఇచ్చి, ముద్రదారణ చేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మఠం అర్చకులు మురళి స్వామి ద్వారపాలక ఆనంతస్వామి ఉన్నారు.

# అక్షరాస్యతలో అగ్రగామిగా నిలపాలి

- డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ



కర్నూలు, ఏప్రిల్ 16మనం న్యూస్: జిల్లాలోనీ నిరక్షరాస్యులు అందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది కర్నూలు జిల్లా ను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలపాలని డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ తెలిపారు. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో 'ఉల్లాస్' కార్యక్రమం అమలుపై డిఆర్ఓ జిల్లా స్థాయి కన్వర్జెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు... గత ఏడాది 'ఉల్లాస్' కార్యక్రమం మొదటి స్పెల్ లో 28 వేల 872 మందికి గాను 27 వేల 200 మంది ఎఫ్ఎల్ఎన్ఏ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి అసెస్మెంట్ టెస్ట్) కి హాజరయ్యారని అందులో 25 వేల 257 మంది సక్సెస్ అయ్యారన్నారు... అదే విధంగా ఈ ఏడాది 30, 005 మందికి అక్షరాస్యతను నేర్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. అర్బన్ లో 50 శాతం రూరల్ లో 50 శాతం మందిని గుర్తించాలని వారిని గుర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ డిఆర్డిఏ, మెప్మా అధికారులను ఆదేశించారు..

ఉల్లాస్ కార్యక్రమం కింద ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 24 వరకు 9 రోజులపాటు సర్వే మొదలుపెట్టి నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు...అనంతరం వారిని గుర్తించిన తర్వాత మే 05 వ తేది నుండి సెప్టెంబర్ 18 వరకు టీచర్లతో క్లాస్ లు నిర్వహించి సెప్టెంబర్ 21 వ తేదీన ఎఫ్ఎల్ఎన్ఏ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి అసెస్మెంట్ టెస్ట్) నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. ఇందుకోసం అంగన్ వాడి కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లను సాయంత్రం రెండు గంటల పాటు అక్షరాస్యత కేంద్రాల కోసం వినియోగించాలన్నారు.వయోజన విద్య శాఖ డిడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం (ఎస్.హెచ్.జి) సభ్యులు, వంటవారు, సహాయకులు, ప్రభుత్వ రాత్రి వాచ్మెన్, ప్రభుత్వ సహాయక పాఠశాలలు, అంగన్వాడీ సహాయకులు/ ఆయాలు మరియు ఎన్ఆర్ఈజిఎస్ కార్మికులలో క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత మరియు డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై దృష్టి సారించి ఈ కార్యక్రమం వినూత్నంగా అమలు చేయబడుతోందన్నారు. 2025-26లో జిల్లాలో మొత్తం 30,005 మందికి అక్షరాస్యతను నేర్పించాలని లక్ష్యంను నిర్దేశించడం జరిగిందన్నారు.

# ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

సి.బెళగల్, ఏప్రిల్ 16(మనం న్యూస్): సి బెలగల్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు బుధవారం నాడు జరిగిన సర్వసభ సమావేశానికి కోడుమూరు నియోజవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై ప్రజలు దగ్గర్నుండి అర్జీలను స్వీకరించారు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో భాగంగా ఈరోజు ప్రజల నుండి వచ్చిన వినదులను స్వీకరించారు అనంతరం మాజీ జెడ్పిటిసి చంద్రశేఖర్ సి.బెళగల్ లోని రోడ్లను వేయాలని ఎమ్మెల్యేకి తమ సమస్యలను అర్జీ రూపంలో వివరించారు అనంతరం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ప్రజలను ఆఫీసులో చుట్టూ తిప్పుకోవద్దని అధికారులకు ఆదేశించారు ప్రజలు తమ సమస్యలను చెప్పుకొనుటకు వచ్చేటప్పుడు అధికారులు వారిపై కృతజ్ఞతా భావంతో కలిగి వారి సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలని ఆయన అధికారులకు సూచించారు వచ్చిన ప్రతి అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని ఆయన తెలిపారు.





### మొక్కజొన్న పంటను పరిశీలన



మంత్రాలయం , ఏప్రిల్ 16, మనం న్యూస్ : మంత్రాలయం మండల పరిధిలోని పరమాన్ దొడ్డి గ్రామానికి చెందిన పరమేష్ నాయక్ ,గణపతి నాయక్ అనే ఇద్దరు రైతుల నాశనమైన మొక్కజొన్న పంటను మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ నేతృత్వంలో జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు రామకృష్ణ రావు , నంద్యాల ఆర్ఏఆర్ఎస్ అధికారి వెంకటరమణ ,సైంటిస్ట్ సుమిత్రమ్మ లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వగరూర్ గ్రామానికి చెందిన అన్వర్ భాష అనే మధ్యదళారి యుపిఎల్ కంపెనీ మొక్కజొన్న విత్తనాలు బాగా పండుతాయి అని చెప్పి రైతులకు ఇప్పించడం జరిగిందని ఆ మొక్కజొన్న విత్తనాలు వల్ల పంట పూర్తిగా నాశనం అయిందని రైతులు ఫిర్యాదు చేశారని వారి ఫిర్యాదు మేరకు మొక్కజొన్న పంట ను పరిశీలించడం జరిగిందన్నారు. దాదాపు రెండు నుంచి మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని , నష్టపరిహాన్ని యుపిఎల్ ద్వారా ఇప్పించాలని అధికారులకు రైతులు విన్నవించారు.

### హానరరీ ప్రొఫెసర్‌గా లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్



కర్నూలు, ఏప్రిల్ 16మనం నూస్: రిపబ్లిక్ ఆఫ్ ఇరాక్ దేశానికి చెందిన విక్టోరియా యూని వర్సిటీ ఆఫ్ కల్చర్ అండ్ వరల్ పీస్ నుంచి సామాజిక సేవా రంగంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ,న్యాయ విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం ,మానవ హక్కుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం తదితర రంగాలలో చేసిన విశేష కృషికి గాను నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లయన్ అంబాసిడర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ కు విక్టోరియా యూనివర్సిటీ ఆఫ్ కల్చర్ అండ వరల్ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ ప్రొఫెసర్ ముస్తఫా దిసౌకి , వైస్ ఛాన్సలర్ డాక్టర్ రానియా అల్ షేక్, సెక్రటరీ జనరల్ డాక్టర్ సాకిరత్ అల్మహబ్బేర్లు అంతర్జాలం ద్వారా గౌరవ హానరరీ ప్రొఫెసర్ గుర్తింపు సర్టిఫికెట్ ను అందజేశారు.ఈ సందర్భంగా లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విక్టోరియా యూనివర్సిటీ ఆఫ్ కల్చరల్ అండ్ వరల్ పీస్ ప్రతినిధులకు లకు ధన్యవాదాలు తెలిపారు.

### ఘనంగా కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి




కర్నూల్, ఏప్రిల్ 16 (మనం న్యూస్): కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా సీనియర్ రంగస్థల కళాకారులు కళా ప్రియ తిరుపాలు కర్నూలు రంగస్థల కళా రత్న పురస్కారం కర్నూలు రంగస్థల కళాకారుల సమక్షంలో కళాప్రియ తిరుపాలకు ఘన సన్మానం జరిగింది. ప్రతి సంవత్సరం కందుకూరి జన్మదినం తెలుగు నాటక రంగ దినోత్సవం గా రంగస్థలం కళాకారులు జరుపుకోవడం ఆనవాయితీ అందులో భాగంగానే బుధవారం కర్నూలు నగరంలో కందుకూరి జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది,. కర్నూలు జిల్లా రంగస్థలకళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు సయ్యద్ రోషనలి, సిబి అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి హనుమంతరావు చౌదరి, సమన్వయకర్త బైలుప్పల షఫీయుల్లా, నాగేశ్వరరావు, నగేష్ కురువ, డి పార్వతయ నాగ శేషు, సవారన్న,రమేష్ కుమార్,స్వర్గీయ కందుకూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి




బేతంచేర్ల మనం న్యూస్: పట్టణంలో మున్సిపల్ కార్మికులకు గత సమ్మె కాలపు ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య కోరారు బేతంచర్ల నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు వైబి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 వేల రూపాయలు ఇచ్చి విధులు నిర్వహిస్తూ మరణించిన కార్మికుల కుటుంబాలకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అలాగే పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని గత సంవత్సరం సమ్మె కాలపు సమయంలో రాష్ట్ర ఉన్నత అధికారులతో సిఐటియు రాష్ట్ర నాయకత్వం చర్చించిన విషయాలలో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ఉన్నతాధికారులు అప్పటి పాలక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది అయితే ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ మాత్రం పట్టించుకోకపోవడం సరైనది కాదని వారు అన్నారు చాలీచాలని వేతనాలతో జీవితాలు గడుపుతున్న మున్సిపల్ కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వకపోగా రెండు నుంచి నాలుగు నెలలు దాకా వేతనాలు ఇవ్వకపోవడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దురదృష్టం అన్నారు.

### హక్కులను కాలరాయడానికే వక్ఫ్ సవరణ

బేతంచెర్ల, ఏప్రిల్16(మనం న్యూస్): భారత దేశంలోని ముస్లింలు హక్కులను కాల రాయడానికి కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు పూనుకుందని ముస్లిం మైనారిటీ నాయకులు రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్ టౌన్ కన్వీనర్ పిట్టల జాకెట్ హుస్సేన్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ముస్లింలకు మద్దతుగా సుప్రీంకోర్టులో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ ను వ్యతిరేకిస్తూ పిలుపు ఇవ్వడం పట్ల ముస్లిం సోదరులు హర్ష వ్యక్తం చేశారు.



### సి.బెళగల్ ఎస్సైగా పరమేష్ నాయక్

సి.బెళగల్, ఏప్రిల్ 16(మనం న్యూస్): సి.బెళగల్ మండల నూతన ఎస్సైగా ఎం.పరమేష్ నాయక్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో బాధ్యతలు చేపట్టారు. పరమేష్ నాయక్ నంద్యాల జిల్లా బేతంచెర్ల గ్రామానికి చెందిన బాలు నాయక్, వెంకటి బాయ్ ల కుమారుడు. పరమేష్ నాయక్ గతంలో మంత్రాలయం మండలంలో గతంలో ఐదు నెలల పాటు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీలలో భాగంగా పరమేష్ నాయక్ కర్నూల్ వి.ఆర్ నుండి సి.బెళగల్ మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎం.తిమ్మారెడ్డి కర్నూల్-1 కు బదిలీ అయ్యారు. నూతన ఎస్సై పరమేష్ నాయక్ పోలీస్ సిబ్బంది పుష్ప గుచ్చంతో స్వాగతం పలికారు.

# సాదాసీదాగా సర్వసభ సమావేశం




సి.బెళగల్, ఏప్రిల్ 16(మనం న్యూస్): సి.బెళగల్ మండల కేంద్రంలో బుధవారం నాడు ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ బొంతల మునియప్ప ఆధ్వర్యంలో సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు ఈ సర్వసభ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు అనంతరం ఎంపీడీవో గత మూడు నెలలలో జరిగిన జరిగిన అభివృద్ధిపై అధికారులు తమ అమూల్యమైన సందేశాలను సమస్యలను అధికారులు ఈ సర్వసభ సమావేశంలో వివరించారు ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ సి.బెళగల్ మండల కేంద్రంలో సుమారు 58 సెంటర్లు ఉన్నాయని ఈ సెంటర్లలో జరిగేటువంటి పోషణ పక్వాడ ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ కార్యక్రమంలో ప్రతి అంగన్వాడి టీచర్లు తమ సెంటర్లలో వెయ్యి రోజులు పిల్లల తల్లిదండ్రులకు పిల్లలకు ఎలా పోషకాలు అందించాలి వాళ్ళు పోషక పదార్థాలు ఏ విధంగా అయితే అందిస్తే బలవంతంగా తయారవుతారు కచ్చితంగా ఈ వెయ్యి రోజులు ప్రణాళికలను ఆచరణ పెడతామని ఆమె తెలిపారు అనంతరం పీహెచ్ వైద్యశాలలో పనిచేయని డాక్టర్లపై ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అసహనం వ్యక్తం చేశారు అనంతరం విద్యా శాఖలో ఉత్తీర్ణ శాతం తక్కువగా ఉన్నందున ఈ ఉత్తీర్ణ శాతాన్ని పెంచే విధంగా ఎంఈఓ లు ఉపాధ్యాయులు సర్వ తీసుకుని పిల్లల భవిష్యత్తుకు పాటుపడాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను ఆఫీసులో చుట్టూ తిప్పుకోకుండా ప్రజలు సమస్యలపై వచ్చేటువంటి వారిని అధికారులు అంకితభావంతో వారి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ఆయన అధికారులకు సూచించారు అనంతరం ఎంపీపీ బొంతల మునియప్ప మాట్లాడుతూ రీసెర్వేలు భూములు అడంగల్ లో ఎక్కడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు అనంతరం తహసిల్దార్ పురుషోత్తముడు మాట్లాడుతూ అడంగల్ లో వారికున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి ఈ సమస్యలు కోర్టులో ఉన్నందున ఈ సాల్ కావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు ప్రతి ఒక్కరు మండలంలో అధికారులు కష్టపడి మండలానికి మంచి పేరు తేవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపిటీసీలు జడ్పిటిసి ఎంపీపీ సర్పంచులు పాల్గొన్నారు

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, ఏప్రిల్ 16, (మనం న్యూస్ ) : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంత్రాలయం మండల పరిధిలోని సూగూరులో చోటుచేసుకుంది. బుధవారం ఎస్ఐ శివాంజుల్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కురువ పెద్దయ్య (65) కుమార్తె లు , కుమారుల వివాహాలకు చేసిన అప్పు తీర్చకపోవడంతో మనోవేదనకు గురై పక్షవాతంతో మంచనపడ్డాడు. అప్పులు మొత్తం రూ. 15 లక్షల దాకా అయ్యిందని దీంతో తను పని చేయడానికి శరీరం సహకరించకపోవడంతో ఇక తన జీవించి నిరుపయోగమని భావించి అప్పుడప్పుడు తమతో ఆత్మహత్య చేసుకుంటానని చెప్పేవాడని మేము సర్ది చెప్పే వాళ్ళమని భార్య వీరనాగమ్మ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు మేము పొలం కు వెళ్లగా నా భర్త ఆయన కురువ పెద్దయ్య మరుగుదొడ్డిలో ఉన్న స్నానపు గదిలో ఉన్న యాసిడ్ బాటిల్లో సేవించి అస్మారకస్థితికి చేరుకోవడంతో కాలనీలోని యువకులు నా కుమారుడికి ఫోన్ ద్వారా తెలియజేశారని , వెంటనే ఇంటికి చేరుకున్న మేము 108 వాహనంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని , అక్కడ వైద్యులు చికిత్స చేశారని , మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామని అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా మృతి చెందాడు.

### శ్రీరామలయ శతాబ్ది ఉత్సవాలకు మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ హాజరు



కర్నూలు, ఏప్రిల్ 16(మనం న్యూస్): నగరంలోని మెయిన్ బజార్లో వెలసిన శ్రీ రామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం జరిగిన శ్రీ సీతారాముల దివ్య మంగళ రథోత్సవ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ తో పాటు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. నగరంలోని గడియారం హాస్పిటల్ నుంచి ప్రారంభమైన శ్రీ సీతారాముల రథోత్సవ కార్యక్రమం మేడమ్ వారి సత్రం వరకు కొనసాగింది. శ్రీ సీతారాముల దివ్య మంగళ రథోత్సవం కొనసాగిన రహదారుల్లో జైశ్రీరామ్ నినాదాలు హొ రెత్తాయి. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ నగరంలోని మెయిన్ బజార్ లో వెలిసిన శ్రీ రామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు .ఆలయం అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తన వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారని వివరించారు. 1925వ సంవత్సరం నుంచి గత 100 సంవత్సరాలుగా శ్రీ రామాలయం లో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు .తాను కూడా తమ తాత స్వగ్రామమైన తుంబలం గ్రామంలో శ్రీ రాముని ఆలయాన్ని అభివృద్ధి పరచామని చెప్పారు. ఈ ఆలయాన్ని ఐదువేల సంవత్సరాల కిందట పాండవులు నిర్మించినట్లు చరిత్ర చెబుతుందని వివరించారు .అలాంటి ఆలయం ను తాము జీర్ణోదరణ చేసి నిత్యం పూజలు జరిగేలా కృషి చేశామని చెప్పారు. ఎవరైనా తుంబలం గ్రామానికి వెళ్ళినప్పుడు అక్కడ ఆలయాన్ని సందర్శించి శ్రీరాముని దర్శించుకోవచ్చు అని వివరించారు. శ్రీ రామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రథోత్సవ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ తెలిపారు.





## IPL-2025



# ధోని కాలికేమైంది?

లఖ్ నవూ సూపర్ జెయింట్స్ తో మ్యాచ్ లో మెరుపు ఇన్నింగ్స్ తో చెన్నై సూపర్ కింగ్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని. మ్యాచ్ ముగిసిన తర్వాత అతడు కుంటుతూ టీమ్ హోటల్ లోకి వెళ్లాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అయింది. బహుమతి ప్రదానోత్సవంలోనూ మహి అసౌకర్యంగా కనిపించాడు. మహి గాయపడ్డాడని.. అతడు తర్వాతి మ్యాచ్ ల్లో ఆడడం కష్టమేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ''ధోని పూర్తి ఫిట్ నెస్ తో ఉన్నట్లు కనిపించట్లేదు. లఖ్ నవూ ఇన్నింగ్స్ చివరికి వచ్చేసరికి అతడు లెగ్ సైడ్ పడిన బంతులను అందుకోవడానికి ఇబ్బంది పడ్డట్లున్నాడు. బ్యాటింగ్ చేసేటప్పుడు కూడా వికెట్ల మధ్య చురుగ్గా పరుగెత్తలేదు. కానీ తన శక్తిని కూడదీసుకుని కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి చెన్నైని గెలిపించాడు. లఖ్ నవూ నుంచి అతడు విజయాన్ని లాగేసుకున్నాడు'' అని టీమ్ ఇండియా మాజీ ఆల్ రౌండర్ సంజయ్ బంగర్ అన్నాడు.

## మేం చాలా చెత్తగా ఆడాం కదా: రహానే



ఐపీఎల్ 2025 సీజన్ లో భాగంగా మంగళవారం కోల్ కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ కు మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లకు 111 పరుగులకు ఆలౌటైంది. తర్వాత ఛేదనకు దిగిన కోల్ కతా నైట్ రైడర్స్ 15.1 ఓవర్లకు 95 పరుగులకు వికెట్లన్నీ కోల్పోయింది. పంజాబ్ చేతిలో 16 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

## టైటిల్ పోరుకు పంకజ్

ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్ షిప్ లో డిఫెండింగ్ ఛాంపియన్ పంకజ్ అడ్వాణీ టైటిల్ పోరుకు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో అతడు 1070-300తో సహచరుడు ధ్రువ్ సిత్వాలాను చిత్తు చేశాడు. ఆరంభంలోనే రెండు బ్రేక్ లు సాధించి 400 పాయింట్లతో ఆధిక్యంలో



నిలిచిన పంకజ్.. తర్వాత అదే జోరు కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. 2016 నుంచి పంకజ్ ఈ టోర్నీలో ఓడిపోలేదు. మరో సెమీస్ లో డేవిడ్ కాసియర్ తో భారత ఆటగాడు సౌరభ్ కొఠారి తలపడనున్నాడు.

## సూపర్ ఓవర్‌లో రాజస్థాన్‌పై దిల్లీ క్యాపిటల్స్ విజయం


రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన సూపర్ ఓవర్ మ్యాచ్ లో దిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన దిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 188 పరుగులే చేసింది. దీంతో మ్యాచ్ టై అయి.. సూపర్ ఓవర్కు దారితీసింది. సూపర్ ఓవర్ లో తొలుత రాజస్థాన్ 2 వికెట్లు కోల్పోయి



11 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన దిగిన దిల్లీ 4 బంతుల్లో లక్ష్యాన్ని ఛేదించింది.

**చెలరేగిన యశస్వి, నితీశ్..**

189 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్కు రాజస్థాన్.. జైశ్వాల్ (51), సంజు శాంసన్ (31) మంచి శుభారంభం ఇచ్చారు. అయితే శాంసన్ రిటైర్డ్ హర్ట్ కావడంతో వచ్చిన రియాన్ పరాగ్ (8) స్వల్ప స్కోర్కు పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన నితీశ్ రాణా (51)తో జట్టు కట్టిన జైస్వాల్ ఇన్నింగ్సును ముందుకు నడిపించాడు. ఇద్దరు బ్యాటర్లు బౌండరీలతో విరుచుకుపడ్డారు. ఈక్రమంలో 112 పరుగుల వద్ద జైస్వాల్ ఔటైనప్పటికీ నితీశ్ దూకుడుగా ఆడాడు. 161 పరుగుల వద్ద మూడో వికెట్గా నితీశ్ పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో ఆ జట్టు విజయానికి 23 పరుగులు అవసరం కాగా 19వ ఓవర్లో 14 పరుగులు వచ్చాయి. దీంతో సమీకరణం 6 బంతుల్లో 9 పరుగులుగా మారింది. చివరి ఓవర్లో స్టార్ 8 పరుగులే ఇవ్వడంతో మ్యాచ్ టై అయింది.



## సౌరభ్ కు కాంస్యం

ప్రపంచకప్ షూటింగ్ ఛాంపియన్ షిప్ స్టేజ్-2 టోర్నమెంట్లో భారత్ ఖాతాలో తొలి పతకం చేరింది. మంగళవారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో సౌరభ్ చౌదరి కాంస్యంతో మెరిశాడు. ఫైనల్లో అతడు 219.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో కయ్ హు (చైనా, 246.4) స్వర్ణం నెగ్గగా.. అల్మీడా (బ్రెజిల్, 241.0) రజతాన్ని సొంతం చేసుకున్నాడు. మరో భారత షూటర్ వరుణ్ తోమర్ (198.1) నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.



# కూలీలో పూజా స్పెషల్ సాంగా...?

కోలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ సూపర్ స్టార్ రజినీకాంత్ అలాగే పాన్ ఇండియా లెవెల్లో మరింతమంది స్టార్ హీరోస్ కలయికలో చేస్తున్న అవైటెడ్ సాలిడ్ ప్రాజెక్ట్ కూలీ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో స్టార్ నటి పూజా హెగ్డే కూడా ఉన్న సంగతి తెలిసిందే. మరి పూజా హెగ్డే అసలు ఈ సినిమాలో ఎలా కనిపిస్తుంది అనేది ఇపుడు రివీల్ అయ్యింది.

ఆమె రీసెంట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను కూలీ సినిమాలో కేవలం ఓ స్పెషల్ సాంగ్ లో కనిపిస్తాను అన్నట్టుగా తెలిపింది. అయితే రజినీ నుంచి రీసెంట్ గా వచ్చిన జైలర్ లో తమన్నాపై కావాలయ్యా సాంగ్ కి ఇది కొంచెం డిఫరెంట్ గా ఉండబోతుంది అంటూ పూజా తెలిపింది. మరి అనిరుద్ ఈసారి ఎలాంటి బీట్స్ ని తలైవర్ కోసం అందించాడో వేచి చూడాలి. ఇక ఈ అవైటెడ్ చిత్రం ఈ ఏడాది ఆగస్ట్ 14న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కి రాబోతుంది.

## 'ఓజి' ఫస్ట్ సింగిల్‌పై సాలిడ్ అప్డేట్!

తెలుగు స్టేట్ ఉప ముఖ్యమంత్రి అలాగే టాలీవుడ్ కి పవర్ స్టార్ కూడా అయినటువంటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రస్తుతం చేస్తున్న చిత్రాల్లో దర్శకుడు సుజీత్ తో చేస్తున్న ఒరిజినల్ గ్యాంగ్ స్టర్ చిత్రం ఓజి కూడా ఒకటి. పవన్



ఓజాస్ గంభీరగా కనిపించనున్న ఈ చిత్రం కోసం అభిమానులు ఎప్పుడు నుంచో మంచి ఎగ్జైటింగ్ గా ఉన్నారు. అయితే గత కొన్నాళ్ల కితమే ఈ సినిమా తాలూకా ఫస్ట్ సాంగ్ ని రిలీజ్ చేయాల్సి ఉంది కానీ పలు కారణాల రీత్యా అది వాయిదా పడింది. మరి అసలు ఈ సాంగ్ ని ఎప్పుడు విడుదల చేస్తారు అనే దానిపై సంగీత దర్శకుడు థమన్ ఎస్ సాలిడ్ అప్డేట్ ని అందించాడు. తమ బ్యాలన్స్ ఉన్న షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందో ఆరోజు గిఫ్ట్ గా అయితే ఓజి ఫస్ట్ సింగిల్ 'ఫైర్ స్టాం'ని విడుదల చేస్తామని క్లారిటీ ఇచ్చాడు. అలాగే ఈ సాంగ్ నే తమిళ హీరో శింబు ఆలపించడం జరిగింది. మరి ఆ రోజు కోసం ఇపుడు పవన్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు భారీ బడ్జెట్ తో నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# హరిహర వీరమల్లు.. ఇంకా ఎన్ని రోజులు..?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'హరిహర వీరమల్లు' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు జ్యోతి కృష్ణ డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీ ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఇక ఈ సినిమాలో పవన్ పాత్ర అల్టిమేట్గా ఉండనుందని ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, వీడియో గ్లింప్స్ చూస్తే



అర్థమవుతుంది. అయితే, ఈ సినిమా ఇప్పటికే పలుమార్లు రిలీజ్ డేట్ వాయిదా వేసుకుని, ఈ వేసవి కానుకగా మే 9న గ్రాండ్ రిలీజ్ కానుందని మేకర్స్ వెల్లడించారు. కానీ, ఇప్పుడు ఈ డేట్లో కూడా హరిహర వీరమల్లు రిలీజ్ కావడం డౌటే అని తెలుస్తోంది. ఇంకా సినిమా పనులు పెండింగ్ ఉన్నాయని.. అందుకే ఈ సినిమాను మే 9న రిలీజ్ చేయడం లేదని చిత్ర వర్గాల ఇన్సైడ్ టాక్. ఈ లెక్కన ఈ చిత్రం ఇంకెప్పుడు రిలీజ్ అవుతుందా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో వింటేజ్ పవన్ కళ్యాణ్ని చూసేందుకు అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు.

# ఖుష్బూ ఖుబ్‌సురత్.. ట్రోలర్స్‌కు కౌంటర్

సోషల్ మీడియాలో తరచూ తన ఫొటోలు పంచుకుంటుంటారు నటి ఖుష్బూ. తాజాగా ఆమె తన న్యూలుక్ ఫొటోలను షేర్ చేశారు. అందులో ఆమె చాలా సన్నగా కనిపించడంతో కొందరు నెటిజన్ లు ట్రోలింగ్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు.



తన తాజా ఫొటోలను షేర్ చేసిన ఖుష్బూ.. ''బ్యాక్ టూ ద ఫ్యూచర్''అనే క్యాప్షన్ పెట్టారు. కొందరు ఆమె సన్నబడిన తీరును ప్రశంసిస్తుంటే మరికొందరు మాత్రం 'సన్నగా మారడానికి ఇంజెక్షన్స్ చేయించుకున్నారు. వాటి మేజిక్ వల్లే ఇలా మారిపోయారు. వాటి గురించి ఫాలోవర్స్కు కూడా చెప్పండి' అని కామెంట్ పెట్టారు. దీనికి ఆమె స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ''మీరు ఎలాంటి మనుషులు? మీరెప్పుడు మీ ముఖాలను సోషల్ మీడియాలో చూపించరు. ఎందుకంటే మీరు అంత అసహ్యంగా ఉంటారు. మీ తల్లిదండ్రులను చూస్తుంటే జాలి వేస్తోంది'' అని రీట్వీట్ చేశారు. ఇక ప్రస్తుతం ఖుష్బూ సీరియల్స్, సినిమాల్లో నటిస్తున్నారు. ఇటీవలే 'నేసిప్పాయ' అనే తమిళ సినిమాలో కనిపించారు.

## టాలీవుడ్‌లో సరికొత్త టెక్నాలజీ.. దిల్ రాజు ప్రకటన

తెలుగు బడా నిర్మాత దిల్ రాజు మరో కొత్త అడుగు వేశారు. మారుతున్న టెక్నాలజీ, ట్రెండ్ కి తగ్గట్లు కొత్తగా సొంత ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కంపెనీ గురించి ప్రకటన చేశారు. ఓ వీడియో కూడా రిలీజ్ చేశారు. తెలుగు సినిమాల్లో ఏఐ టెక్నాలజీకి సంబంధించిన పనులు చేసే క్వాంటమ్ ఏఐ గ్లోబల్ సంస్థతో కలిసి కొత్తగా ఏఐ స్టూడియోను ప్రారంభించబోతున్నట్లు దిల్ రాజు ఓ వీడియో ద్వారా తెలియజేశారు. సినిమా



ప్రస్థానం మొదలైన 1913 నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మార్పులు వచ్చాయనేది ఇందులో చూపించారు. పూర్తి వివరాలు మే 4న వెల్లడిస్తామని పేర్కొన్నారు. దిల్ రాజు ప్రకటన బట్టి చూస్తే తాను నిర్మించే సినిమాలతో పాటు టాలీవుడ్ లోని ఇతర చిత్రాల్లో గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ సహా పలు విభాగాల్లో ఏఐ సాంకేతికతని ఉపయోగించబోతున్నారు. దీని ద్వారా ఎలాంటి మార్పులు జరగబోతున్నాయనేది మరికొన్నేళ్లలో తెలుస్తుంది.

## నెక్లెస్‌తో వార్తల్లో నిలిచిన ఖుషి కపూర్



బాలీవుడ్ యువ నటి ఖుషి కపూర్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఆమె షేర్ చేసిన కొన్ని ఫొటోలు ఇప్పుడు అంతటా వైరల్ గా మారాయి. ఇందులో ఆమె ఒక సాధారణ నెక్లెస్ ధరించి ట్రెండీ లుక్ లో కనిపించారు. ఆ నెక్లెస్ లోని లాకెట్ పై వి లవ్స్ (హార్ట్ సింబల్) కె అని రాసి ఉంది. హార్ట్ సింబల్ ను జత చేస్తూ ఈ ఫొటోలను ఇన్ స్టాలో షేర్ చేశారు. వీటిని చూసిన పలువురు నెటిజన్లు వి అంటే వేదాంగ్ అని కె అంటే ఖుషి కపూర్ అని భావిస్తున్నారు. వీటితో తమ బంధాన్ని ఆమె కన్ఫార్మ్ చేశారని పలువురు అనుకుంటున్నారు.

అలనాటి నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషి. 2023లో విడుదలైన 'ది ఆర్చీస్' తో ఆమె నటిగా తెరంగేట్రం చేశారు. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో సహ నటుడు వేదాంగ్ రైనాతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆనాటి నుంచి వీరిద్దరూ ప్రేమలో ఉన్నారంటూ వార్తలు వచ్చాయి. వీరిద్దరూ కలిసి పలు పార్టీలకు హాజరయ్యారు. ఇటీవల వేదాంగ్ నటించిన 'జిగ్రా' విడుదలైనప్పుడు ఆయన్ని ప్రోత్సహిస్తూ ఖుషి పోస్ట్ పెట్టారు. ప్రమోషన్స్ లో ఆయనకు ఖుషి గురించి పరోక్షంగా ప్రశ్నలు ఎదురుకాగా ఆయన సిగ్గుపడ్డారు. ఆమె తనకు బెస్ట్ ఫ్రెండ్ అని బదులిచ్చారు.



## ఫన్ రైడ్‌గా 'సారంగపాణి జాతకం' ట్రైలర్

టాలీవుడ్ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ డైరెక్షన్ లో ప్రియదర్శి, రూప కొడువాయుర్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన లేటెస్ట్ చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇప్పటికే షూటింగ్ ముగించుకున్న ఈ సినిమా రిలీజ్కు రెడీ అయ్యింది. ఏప్రిల్ 25న ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా తాజాగా ఈ మూవీ ట్రైలర్ను మేకర్స్ లాంచ్ చేశారు.

ఈ ట్రైలర్ ఆద్యంతం ఎంటర్ టైనింగ్ గా కట్ చేశారు. ప్రియదర్శి, వెన్నెల కిషోర్, హర్ష చేసే కామెడీతో ఈ ట్రైలర్ పూర్తి ఫన్ రైడ్ గా సాగింది. జాతకాన్ని నమ్మే హీరోకి ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి.. అతడి ప్రేమకు ఎలాంటి సమస్య ఎదురైంది.. వాటన్నింటిని హీరో ఎలా ఎదుర్కొన్నాడు అనే కాన్సెప్ట్ తో ఈ సినిమాను రూపొందించారు. ఇక ఈ సినిమాలో వెన్నెల కిషోర్, హర్షలతో కలిసి ప్రియదర్శి చేసే కామెడీ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తడం ఖాయమని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.

ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందించగా భారీ క్యాస్టింగ్ ఇందులో నటిస్తుంది. శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని శ్రీదేవి మూవీస్ బ్యానర్ పై ప్రొడ్యూస్ చేస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.